మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

అనుక్షణం
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
హైదరాబాద్ | 19 శనివారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 32
Navabhoomi daily fallows..




# బాస్ వస్తున్నారు!

- అసెంబ్లీ ఎన్నికల తర్వాత సబ్దుగా ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- ఒకటీ రెండు సార్లు మినహా ఎక్కువకాలం ఫార్మ్‌హౌజ్‌లోనే
- కేటీఆర్,హరీశ్ ఉన్నా సర్కార్‌ను సరిగా ఎదుర్కోవడం లేదన్న అపవాదు
- సరైన సమాచారంతో డిసెంబర్‌లో మళ్లీ జనంలోకి కేసీఆర్
- రేవంత్ రెడ్డి ప్రభుత్వ విధానాలపై ఎండ గట్టేందుకు సిద్ధం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ యాసలో చక్కని వాక్చాతుర్యం ఉన్న కేసీఆర్ గొంతు గత పది నెలలుగా మూగబోయింది. రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా బాధ్యతల్లో కొనసాగిన ఆయనకు.. గత అసెంబ్లీ ఎన్నికలు ఝలక్ ఇచ్చారు. దాంతో అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇక అప్పటి నుంచి ఆయన నుంచి ఓ ప్రెస్‌మీట్ కానీ.. ఓ స్టేట్‌మెంట్ కానీ వినిపించలేదు. పది నెలలుగా ఆయన ఫామ్‌హౌజ్ జీవితాన్నే గడుపుతున్నారు. పది నెలలుగా ఆయన గొంతు ప్రజలు ఇంతవరకు వినలేదు. దాంతో అసలు కేసీఆర్‌కు ఏమైంది అని అటు ప్రజల్లోనూ.. ఇటు పార్టీ కేడర్‌లోనూ ఆందోళన కనిపించింది. పది నెలలుగా ప్రభుత్వ వైఫల్యాలు వెలుగుచూస్తున్నా ఇంతవరకు ఆయన వాటిపై నిలదీసింది లేదు. అలాగే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవిచూసినా పెద్దగా మాట్లాడలేదు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో అయితే ఊహించని ఫలితాలు వచ్చినా ఎక్కడా కనీసం రివ్యూలు చేయలేదు. కనీసం ఆయన ఒక్కసారిగా కూడా మీడియా ముందుకు వచ్చింది లేదు. దీంతో మీడియాలోనూ ఆయనపై పెద్దగా కథనాలు రావడంలేదు. మీడియాతో ఇంటరాక్షన్ కూడా లేకుండా పోయింది. పది నెలలుగా బయటకు రాకపోవడంతో చివరకు జనాలు కూడా ఆయన్ను మరిచిపోయే పరిస్థితులు వచ్చాయని క్యాడర్ చెబుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు గడిచింది. ఈ క్రమంలో ప్రభుత్వం చేస్తున్న పనులపై ఇప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో కేటీఆర్, మాజీమంత్రి హరీశ్ రావు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తున్నారు. నిత్యం ట్విట్టర్‌లోనూ ఏదో ఒక పోస్టింగ్ పెడుతూనే ఉన్నారు. ఏదో ఒక రూపంలో ప్రభుత్వానికి

# ఏపీ బడ్జెట్‌కు కసరత్తు

- నవంబరు రెండో వారంలో ఏపీ బడ్జెట్!
- రూ.2.90 లక్షల కోట్ల అంచనాతో పద్దు
- వరుస సమావేశాలతో ఆర్థికశాఖ బిజీ
- 'సూపర్ సిక్స్‌పై కసరత్తు

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను నవంబరు రెండో వారంలో ప్రవేశపెట్టనున్నారు.
ఆర్థికశాఖ అధికారులు బడ్జెట్ రూపకల్పనలో తలమునకలై ఉండగా.. శాసనసభ, ఆర్థిక వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఆర్థిక శాఖ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇప్పటికే రెండు, మూడు తేదీలు ప్రతిపాదనకు వచ్చాయి. రాష్ట్రంలో ఎన్నికల దృష్ట్యా జగన్ ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను సమర్పించింది. మొత్తం రూ.2,86,389 కోట్లకు బడ్జెట్ సమర్పించారు. 2024 ఏప్రిల్ నుంచి జులై 31 వరకు నాలుగు నెలల కాలానికి మొత్తం 40 గ్రాంట్ల కింద రూ.1,09,052.34 కోట్లకు శాసనసభ ఆమోదం తీసుకున్నారు. జూన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. జులైలో పూర్తి స్థాయి బడ్జెట్ సమర్పించాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం, ఎన్ని అప్పులున్నాయో తెలియని గందరగోళ పరిస్థితుల్లో.. పూర్తి వివరాలు రాబట్టి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం వెలువరించి పకడ్బందీ వ్యూహంతో ముందుకెళ్లాలనే ఉద్దేశంతో మరోసారి ఓటాన్ ఎకౌంట్‌కు ఆర్డినెన్సు రూపంలో ఆమోదం తీసుకున్నారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు, ఇతర కార్యకలాపాల కోసం రూ.1,29,972.97 కోట్లతో 40 గ్రాంట్ల కింద రెండో తాత్కాలిక బడ్జెట్‌కు గవర్నర్ నుంచి ఆమోదం తీసుకున్నారు. ఇలా మొత్తం 8 నెలల కాలం ఓట్ ఆన్ అకౌంట్ పద్దుతోనే గడిచిపోయింది. ఈ నేపథ్యంలో నవంబరు రెండో వారంలో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి శాసనసభ ఆమోదం తీసుకోవాల్సి ఉంది.

# ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్ వృద్ధి రేటు భేష్

- భారత్ వృద్ధి రేటు పెరుగుదలలో మెజార్టీ పాత్ర దేశీయ మార్కెట్లదే
- దేశ ప్రజల జీవన నాణ్యత, పరిశుభ్రమైన గాలి, నీటి లభ్యత గురించి భారత్ చర్యలు చేపట్టాలి
- ఈ అంశాలపై భారత్ మరిన్ని ప్రాజెక్టులు రూపొందించాలి



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** ఆర్థికవ్యవస్థలో భారత్ పాత్ర గురించి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారత్ వృద్ధి రేటు మెరుగ్గా ఉందని ఆయన పేర్కొన్నారు.
ఈవిషయంలో ఏ సందేహం లేదన్నారు. భారత్ వృద్ధి రేటు పెరుగుదలలో మెజార్టీ పాత్ర దేశీయ మార్కెట్లదేనని.. ఆరోగ్యకరమైన వాతావరణానికి ఇది సూచిక అని తెలిపారు. త్వరలో నిర్వహించనున్న ప్రపంచ బ్యాంకు అంతర్జాతీయ వార్షిక సమావేశానికి సంబంధించిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే దేశ ప్రజల జీవన నాణ్యత, పరిశుభ్రమైన గాలి, నీటి లభ్యత గురించి భారత్ చర్యలు చేపట్టాలని అజయ్ బంగా సూచించారు. భవిష్యత్తులో ఈ అంశాలపై భారత్ మరిన్ని ప్రాజెక్టులు రూపొందించాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆర్థికవృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని భారత్ మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దేశాల సుస్థిర అభివృద్ధికి ప్రపంచబ్యాంకు మద్దతిస్తుందన్నారు.

# సుప్రీంకోర్టును ఆశ్రయించిన గ్రూప్-1 అభ్యర్థులు

- తీర్పు వచ్చే వరకు పరీక్ష వాయిదా వేయాలంటూ పిటిషన్
- జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోలేదన్న పిటిషనర్లు
- తదుపరి విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా



**దిల్లీ-నవభూమిబ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్ష వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షల నిలిపివేయాలని కొందరు

## విద్యా కమిషన్ సభ్యుల నియామకం

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ప్రకటన జారీ చేసింది. తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఇదివరకే విద్యా కమిషన్ ఛైర్మన్ గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని నియమించగా.. తాజాగా నేడు కమిషన్ సభ్యులను నియమించింది. కమిషన్ సభ్యులుగా ప్రొఫెసర్ పీ.ఎల్ విశ్వేశ్వర రావు, చారగొండ వెంకటేష్, కే. జ్యోత్స్న శివారెడ్డిలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# ప్రజలు గెలవాలి రాష్ట్రం నిలబడాలి

- ప్రజలు మనల్ని విశ్వసించారు..
- అందరిపై బాధ్యత ఉంది: సీఎం చంద్రబాబు
- అండగా ఉన్న వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం
- పదవుల విషయంలో అందరికీ న్యాయం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని వైకాపా సర్వనాశనం చేసిందని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు విమర్శించారు. ఆ పార్టీ పాలనలో అన్నివర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు.
తనను జైల్లో పెడితే పవన్‌కల్యాణ్ వచ్చి పరామర్శించి.. తెదేపాతో కలిసి పోటీ చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారని గుర్తుచేశారు. మోదీ నుంచి అందరూ నేర్చుకోవాలని.. పట్టుదల, కృషి వల్లే ఆయన మూడోసారి ప్రధాని అయ్యారని కొనియాడారు. వైకాపా చేయని తప్పులు లేవని.. అందుకే ప్రజలు చిత్తుగా ఓడించారని చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కూటమికి 93 శాతం స్ట్రయిక్‌రేట్ ఇచ్చారన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

**అండగా ఉన్న వర్గాలకు ప్రాధాన్యం కల్పించాం**
"దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ తెదేపా. భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది సమీక్షించాలి. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నాం. రాష్ట్రంలో మూడు పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి. ఎన్నికల సీట్ల కేటాయింపులో తెదేపాకు అండగా ఉన్నవర్గాలకు ప్రాధాన్యం కల్పించాం. ఇంతవరకు ప్రాతినిధ్యం దక్కని వారికి అవకాశం కల్పించాం. 'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాం.

**రాజకీయ పార్టీ.. కుటుంబం లాంటిదే**
గెలిచాం మన పని అయిపోయిందని అనుకుంటే చాలా సమస్యలు వస్తాయి. ఎన్నికల సమయంలో ఉన్న పరిస్థితుల వల్ల పార్టీని నమ్ముకున్న కొంతమందికి సీట్లు ఇవ్వలేకపోయాం. న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చాం. ప్రజలు మనల్ని విశ్వసించారు.. దాని ప్రకారం ముందుకెళ్లాలి. ఇప్పుడు అందరిపై బాధ్యత ఉంది. కొత్త ఎమ్మెల్యేలు 65 మంది ఉన్నారు. 18 మంది కొత్త మంత్రులు ఉన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీల్లో దాదాపు 80 మంది వరకు కొత్త

# అసమ్మతిరాగాలు?

- తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధిష్టానానికి కొత్త తలనొప్పి
- కాషాయ పార్టీలో అగ్రనేతల అంతర్మథనం
- అధికారంలోకి వస్తుందనుకున్నాం..ఎందుకు 8సీట్లకే పరిమితమైంది
- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి,ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలతో దుమారం
- యాభైలక్షల సభ్యత్వాలు లక్ష్యమైతే..ఇప్పటి వరకు 20లక్షలే
- సమష్టిగా పని చేయలేకపోతున్న పార్టీ కేడర్

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కాషాయంలో అంతర్మథనం... నేతల అసమ్మతి రాగం.. మొన్న కాటేపల్లి.. నిన్న ధర్మపురి.. తెలంగాణ బీజేపీలో అసమ్మతిరాగం కనిపిస్తోందా..? నేతల మధ్య సయోధ్య కుదరడం లేదా..? తెలంగాణ బీజేపీలో అసమ్మతిరాగం కనిపిస్తోందా..? నేతల మధ్య సయోధ్య కుదరడం లేదా..? అందుకే ఒక్కో నేత పార్టీ మీద, రాష్ట్ర నాయకత్వం మీద విమర్శలు చేస్తున్నారా..? వారి విమర్శల్లో ఉన్న నిజం ఎంత..? వారి మాటలపై పార్టీలోనూ అంతర్మథనం మొదలైందా..? అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధిష్టానానికి కొత్త తలనొప్పి మొదలైంది. ఇటీవల వరుసకట్టి నేతలు నాయకత్వంపై, గత అసెంబ్లీ ఎన్నికలపై విమర్శలు చేయడం పార్టీలో చర్చకు దారితీసింది. ఒక్కసారిగా ఇలా స్వరం వినిపించడంపై పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆలోచనలో పడింది. కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ చేసిన వ్యాఖ్యలు పెను దురమారం రేపాయి. ఇటీవల సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రెస్‌మీట్ పెట్టారు. ఈ సందర్భంగా ఆయన గత అసెంబ్లీ ఎన్నికలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర నాయకత్వాన్ని నిందించారు. ఇక నిజామాబాద్ ఎంపీ

## రీచ్‌ల నుంచి ట్రాక్టర్లలో ఇసుకకు అనుమతి

**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీ ప్రభుత్వం ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను ట్రాక్టర్లల్లో తీసుకెళ్లేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు కేవలం ఎడ్ల బండ్లకు మాత్రమే ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ప్రస్తుతం ట్రాక్టర్లకూ అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక అవసరాల నిమిత్తమే ట్రాక్టర్లలో ఇసుకను తీసుకెళ్లవచ్చని పేర్కొంది.

# వైకాపా నేతల ప్రోద్బలంతోనే రెచ్చిపోయా

- ఇకపై అలాంటి తప్పు చేయను: బోరుగడ్డ అనిల్
- రిమాండ్ విధించిన కోర్టు.. జైలుకు తరలింపు
- పోలీసుల అదుపులో బోరుగడ్డ అనిల్‌కుమార్
- 2 గంటల పాటు అనిల్‌ను విచారించిన సీఐ



**అమరావతి-నవభూమిబ్యూరో:** రాజకీయ భవిష్యత్తు ఉంటుందని కొందరు ప్రోత్సహించడంతో ప్రతిపక్ష నేతలపై దూషణలకు పాల్పడ్డానని రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలిసింది.
వైకాపా పాలనలో నోటికొచ్చినట్లు దూషించడం, అరాచకాలు, అక్రమాలకు పాల్పడిన అతను ఎన్నికల ఫలితాల తర్వాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో కర్లపూడి బాబూ ప్రకాష్‌ను డబ్బుల కోసం బెదిరించడంతో 2021లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి బుధవారం రాత్రి గుంటూరులో అనిల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం వైద్య పరీక్షలు చేయించి కోర్టులో హాజరుపరచగా 13 రోజుల రిమాండ్ విధించింది. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.అంతకుముందు అరండల్‌పేట ఠాణాల డీఎస్పీ జయంరాంప్రసాద్, పట్టాభిపురం సీఐ వీరేంద్రబాబు, అరండల్‌పేట సీఐ కొంకా శ్రీనివాసరావు సుమారు రెండు గంటలకుపైగా అనిల్‌కుమార్‌ను విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. వైకాపా ప్రభుత్వంలో ఎందుకు అక్రమాలకు పాల్పడ్డావు? నాటి ప్రతిపక్ష నాయకులను, మహిళలను ఎందుకు అసభ్య పదజాలంతో దూషించావు. ఎన్నికల ఫలితాల తర్వాత ఎక్కడికెళ్లారు? ఎవరు ఆశ్రయం ఇచ్చారంటూ పోలీసులు ప్రశ్నల వర్షం కురిపించారు. కొంతమంది వైకాపా నేతల ఒత్తిడి, ప్రోద్బలం వల్లనే అప్పట్లో అలా వ్యవహరించానని చెప్పినట్లు సమాచారం. నాయకుడిగా ఎదగడానికి అవకాశముందని వారు చెప్పిన మాటలు నమ్మి దూకుడుగా ప్రవర్తించానని సమాధానమిచ్చాడు.ఇకపై అలాంటి తప్పు చేయనని వాపోయినట్లు తెలిసింది. అప్పట్లో ఎవరి ప్రోద్బలంతో మాట్లాడారో చెప్పాలని పోలీసులు పదేపదే ప్రశ్నించినా.. స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. వైకాపా జిల్లా అధ్యక్షుడు ఒకరు మంచి భవిష్యత్తు ఉంటుందంటే రెచ్చిపోయానని, ఇప్పుడేమో ఆయన పార్టీ మారడంతో తననెవరూ పట్టించుకోవడం లేదని చెప్పినట్లు సమాచారం. గుంటూరు జిల్లాలోని వివిధ ఠాణాల్లో అనిల్‌కుమార్‌పై 20కి పైగా కేసులున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ కేసులు ఉండటంతో అన్ని ఠాణాలకు సమాచారం పంపినట్లు పోలీసులు తెలిపారు.

# జీవీఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి?

- విశాఖను మెగాసిటీగా తీర్చిదిద్దే క్రమంలో ఆమ్రపాలిని జీవీఎంసీ కమిషనర్‌గా నియమించాలని సీఎం ఆలోచన
- విశాఖ మీద పట్టున్న ఆమ్రపాలి నియామకం సిటి లాభిస్తుందని భావన
- డైనమిక్ అధికారిగా పేరున్న ఆమ్రపాలిని పంచాయత్‌రాజ్ శాఖలో తీసుకోవాలని పవన్ యోచన

2




**అమరావతి-నవభూమిబ్యూరో**
ఆమ్రపాలిని పంచాయతీ రాజ్ శాఖలో కీలక పదవిలోకి తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు తెలంగాణా నుంచి ఏపీకి వచ్చిన ఐఏఎస్ అధికారి ఆమ్రపాలికి ఏ పోస్టింగ్ ఇస్తారు అన్నది చర్చ సాగుతోంది. ఆమె 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి. ఆమెను మహా విశాఖ నగర పాలక సంస్థ కమిషనర్ గా నియమిస్తారు అని ప్రచారం సాగుతోంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఐటీ మంత్రి నారా లోకేష్, మునిసల్ మంత్రి నారాయణ చర్చించి ఒక నిర్ణయానికి వచ్చారు అంటున్నారు. యువ ఐఏఎస్ గా సమర్థవంతమైన అధికారిగా

# షెడ్యూల్ ప్రకారమే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు.. పిటిషన్లను కొట్టేసిన హైకోర్టు




హైదరాబాద్-నవభూమి: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని దాఖలైన పిటిషన్లను హైకోర్టు కొట్టేసింది. దీంతో షెడ్యూల్ ప్రకారమే ఈ నెల 21 నుంచి యథావిధిగా గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించనున్నారు. సింగిల్ బెంచ్ తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించింది. ప్రాథమిక కీలో తప్పులున్నాయనే పిటిషన్‌పై డివిజన్ బెంచ్ తీర్పు ఇచ్చింది. గ్రూప్-1 పరీక్షలపై దాఖలైన పిటిషన్లన్నింటినీ హైకోర్టు కొట్టి వేసింది.ఇక అశోక్ నగర్‌లో మళ్లీ ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. గ్రూప్-1 పరీక్షలను రీ షెడ్యూల్ చేయాలని ఆందోళనకు దిగిన అభ్యర్థులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. పోలీసుల దాడుల్లో పలువురు అభ్యర్థులకు తీవ్ర గాయాలయ్యాయి. జీవో 29 రద్దు చేసేంత వరకు తమ పోరాటం ఆగదని అభ్యర్థులు తేల్చిచెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో అశోక్ నగర్ దద్దరిల్లిపోతోంది.



## 9 యూనివర్సిటీలకు వీసీల నియామకం.. ఓయూ వైస్ ఛాన్సలర్‌గా కుమార్

హైదరాబాద్-నవభూమి: తెలంగాణలోని 9 యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీసీల నియమాక దస్త్రంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. %ఉస్మానియా యూనివర్సిటీగా వీసీగా కుమార్, కాకతీయ యూనివర్సిటీ వీసీగా ప్రతాప్ రెడ్డి, మహాత్మా గాంధీ యూనివర్సిటీ వీసీగా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ యూనివర్సిటీ వీసీగా యాదగిరి రావు, పాలమూరు యూనివర్సిటీ వీసీగా జీఎన్ శ్రీనివాస్, తెలుగు యూనివర్సిటీ వీసీగా నిత్యనందరావు, శాతవాహన యూనివర్సిటీ వీసీగా ఉమేశ్ కుమార్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ వీసీగా అల్దాస్ జానయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీగా ప్రొఫెసర్ రాజిరెడ్డి నియామకం అయ్యారు.

## మాజీ మంత్రి బంధువులపై చీటింగ్ కేసు.. ఏం జరిగిందంటే

హైదరాబాద్-నవభూమి: మాజీ మంత్రి బంధువులపై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. తమ ప్రాపర్టీలో మాజీ మంత్రి బంధువులు అక్రమంగా వచ్చి ఉంటున్నారంటూ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి బంధువులపై మియాపూర్‌లో ట్రెస్‌పాస్, చీటింగ్ కేసు నమోదు అయ్యింది. దండు లచ్చిరాజు అనే వ్యక్తికి మియాపూర్‌లో ఐదు అంతస్థుల ప్రాపర్టీ ఉంది. అయితే మాజీ మంత్రి బంధువులు అక్రమంగా ఆక్రమించుకుని అక్కడే ఉంటున్నారని సదరు బాధితుడు వాపోయాడు.

తన్నీరు గౌతం, బోయినపల్లి వెంకటేశ్వర రావు, గోని రాజకుమార్ గౌడ్, గారపాటి నాగరవి, జంపన ప్రభావతి, తన్నీరు పద్మజారావు తన ప్రాపర్టీని ఆక్రమించారని బాధితుడు దండులచ్చిరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫాస్మో హాస్పిటాలిటీ సర్వీసెస్ పేరుతో ప్రామిసరీ నోటు తీసుకుని చీటింగ్‌కు పాల్పడ్డారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**వైసీపీ నేతలు ఆదేశిస్తేనే తిట్టా!**

బ్లాంక్ చెక్, బ్లాంక్ ప్రామిసరీనోటు తీసుకుని మరీ మాజీ మంత్రి బంధువులు చీటింగ్‌కు పాల్పడ్డారని.. తనకు తెలియకుండానే తన ఇంటిని అమ్మేశారని ఫిర్యాదు చేశారు. జంపన ప్రభావతి మీద లచ్చిరాజు ఆరోపణలు గుప్పించారు. తనకు వ్యతిరేకంగా ఇంజంక్షన్ ఆర్డర్ తెచ్చారని ఆరోపించారు. ఈ విషయంపై 2019 నుంచి లచ్చిరాజు పోరాడుతున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు అయిన వాళ్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్‌రావుగా సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## బాలయ్య బ్లెస్సింగ్స్ కోరిన హోంమంత్రి... వీడియో వైరల్!



హైదరాబాద్-నవభూమి: సాధారణంగా పెద్దవాళ్లు ఎవరైనా కనిపిస్తే.. వాళ్ల కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం సహజమే! ఇక రాజకీయలకు వచ్చేసరికి.. పార్టీ అధినేత పాదాలకు నాయకులు, కార్యకర్తలు నమస్కరిస్తుంటారు.. అధినేత ఆశీర్వాదాలు కోరుకుంటుంటారు. ఈ క్రమంలో తాజాగా బాలకృష్ణ కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు హోంమంత్రి అనిత. . హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కాళ్లకు ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత నమస్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు బాలయ్యబాబు ఆశీస్సులు అందజేశారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఇదే సమయంలో.. పక్కనే ఉన్న మరో మంత్రి సవిత.. బాలయ్యకు వినయంగా నమస్కరించారు. %టూశ్రీంశీ =ఖుం% - సునీతకు ఎన్ని కష్టాలో.. తొందరపడి రాజీనామా..! దీంతో... బాలయ్యపై ఉన్న అభిమానంతో ఆమె అలా చేసి ఉంటారని అంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇక ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ గెలిచి.. హిందూపురం నుంచి ఎమ్మెల్యేగా బాలయ్య హ్యాట్రిక్ కొట్టిన సంగతి తెలిసిందే. ఇక పాయకరావుపేట నుంచి పోటీ చేసిన అనిత.. 43,727 ఓట్లతో గెలిచారు. హోంమంత్రి అయ్యారు! కాగా.. నేతలు, కార్యకర్తలు, ప్రజలు తన కాళ్లకు నమస్కరించే విషయంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఎంతవారిస్తున్నా తన కాళ్లకు నమస్కారాలు చేస్తున్నారని.. ఎవరైనా తన కాళ్లకు మొక్కితే.. తిరిగి తాను కూడా వాళ్ల కాళ్లకు మొక్కుతానని చంద్రబాబు స్పష్టం చేశారు.

## గాంధీభవన్ వద్ద గ్రూప్ - 4 అభ్యర్థుల ఆందోళన.. డిమాండ్స్

హైదరాబాద్-నవభూమి: గాంధీ భవన్ వద్ద గ్రూప్ -4 ఉద్యోగ అభ్యర్థులు శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. కొందరు గ్రూప్ -2, గ్రూప్ -1 మెయిన్‌కు ఎంపిక అయిన వారిని గ్రూప్ 4 నుంచి వెంటనే అన్ లివింగ్ చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద పోస్టులలో ఉన్న వారు అన్ లివింగ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. వారి పోస్టులు వచ్చి వెళ్లిన తర్వాత బ్యాక్ లాగ్‌లుగా ఉంచవద్దని.. దీని వల్ల వెనకున్న అభ్యర్థులు నష్టపోతారని వాపోయారు. రెండు వేల పోస్టులు ఖాళీ అయ్యో అవకాశం ఉందని.. వెంటనే ప్రభుత్వం స్పందించాలని గ్రూప్ -4 అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్ -1 అభ్యర్థుల ఆందోళనతో గాంధీభవన్ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వారిని నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

## పినపాక ఏజెన్సీలో విజృంభిస్తున్న జ్వరాలు



మణుగూరు(భద్రాద్రి కొత్తగూడెం): నవభూమి: పినపాక ఏజెన్సీ ప్రాంతంలో పోస్ట్ వైరల్ ఫీవర్స్( ప్రజలను వణికిస్తున్నాయి. మణుగూరు, పినపాక, అశ్వాపురం, కరకగూడెం తదితర మండలాల్లో కొత్తగా వస్తున్న జ్వరాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కాళ్లు వాచిపోయి నడవడమే కష్టంగా మారుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి జ్వరాలన వైద్యులు పోస్ట్ వైరల్ ఫీవర్స్ అంటున్నారు.ఈ వార్తను కూడా చదవండి: %ఖశేష్ఠుస్త్రబఎవఎ%: హోమ్ వర్క్ చేయకపోతే మరీ ఇంత దారుణంగా కొడతారా.. వైరల్ అవుతున్న వీడియో..భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే పలుసార్లు వైరల్ ఫీవర్లు, సీజినల్ వ్యాదులపై గ్రామాల్లో ర్యాపిడ్ సర్వేలు నిర్వహించిన వైద్యాధికారులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, టైపాయిడ్(%ఘీశ్రీఖతీఈు, ఎవఅస్త్రబవ, ఎష్త్రఅఎవఅ జూశీఇ, ¯ఎజూష్త్రశీఅఎ%) వంటి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయితే ఈ క్రమంలోనే జ్వరం వచ్చిన కొందరిలో పోస్టు వైరల్ ఫీవర్ అనే లక్షణాలు ఉంటున్నాయని, వీటి వల్లనే ఒళ్లు నొప్పులు, కాళ్ల వాపులు ఉంటున్నాయని చెబుతున్నారు. సుమారు పదేళ్ల క్రితం చికెన్‌గున్యాతో ఇబ్బందిపడ్డ ఏజెన్సీ ప్రజలు ఇప్పుడు పోస్ట్ వైరల్ జ్వరాలతో తీవ్ర ఇ బ్బ ం ద ు ల ు ఎదుర్కొంటున్నారు.ఏజెన్సీ గ్రామాల్లో అపరిశుభ్ర వాతారణం, పారిశుధ్యం సమస్యలే జ్వర విజృంభణకు కారణమని వైద్యులు చెబుతున్నారు. పరిసరాల్లో అపరిశుభ్రత పెరిగిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రతలు తీసుకోక పోవడంతో దోమల వ్యాప్తి పెరిగి ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు.

లక్షణాలు ఇవే..జ్వరంతో ప్రారంభమై ఒళ్లు నొప్పులు, కాళ్ల నొప్పులు, తలనొప్పి, నీరసించి బలహీనమవ్వడం ప్రధాన లక్షణాలుగా ఉన్నాయి. ముఖ్యంగా కండరాలు, ఎముకల నొప్పులు తీవ్రంగా ఉంటాయి. జ్వరం సోకిన వారిలో రోగ నిరోధక శక్తి మెరుగ్గా ఉంటే ఇవి తగ్గేందుకు వారం రోజులు పడుతుం ది. రోగనిరోదక శక్తి సరిగా లేనివారికి మాత్రం ఆరు వారాల వర కు సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. మణుగూరు ఏరియా ఆసుపత్రికి పినపాక ఏజెన్సీతో పాటు ములుగు జిల్లా నుంచీ జ్వర బాధితులు వచ్చి చికిత్స పొందుతున్నారు. అనేకమం ది పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిల్లోనూ చికిత్స పొందుతున్నారు.

ఖర్చుతో కూడుకున్న వైద్యం

రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఇలాంటి కొత్త జ్వరాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జ్వరాన్ని తగ్గించుకునేందుకు ఎక్కడి వెళ్లాలో తెలియక ఆయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం జ్వరం వస్తే రెండు నుంచి మూడు వేలకు వరకు ఖర్చవుతోంది. మలేరియా, తదితర జ్వరాల నిర్ధార్ణ పరీక్షలకు సుమారు రూ.600 వరకు ఖర్చవుతోంది.

ఆ తర్వాత మందులు, ఇతర ఆసుపత్రి చార్జీలు కలుపు కొని వేలాది రూపాయాలు చెల్లించాల్సి వస్తోందని కొందరు బాధితులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మణుగూ రు వైద్యాధికారి డి. శివకుమార్‌ను వివరణ కోరగా ఈ విధమైన కేసులు రోజుకు 20 వరకు వస్తున్నాయని, రక్త నమూనాలు సేకరించి కొత్తగూడెం పంపిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మురుగు నీటి కాలువలు శుభ్రంగా లేకపొందం, దోమకాటు వల్ల ఇలాంటి జ్వరాలు వస్తాయన్నారు. ఇలాంటి జ్వర బాధితులు పూర్తిగా కోలుకునేందుకు ఆరు వారాల నుంచి ఆరు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందన్నారు.

## హైడ్రా టార్గెట్ చేంజ్.. ఇళ్లను వదిలి ఇక వాటిపైకి.. ’



హైడ్రా వ్యవస్థ అమల్లోకి వచ్చినప్పటి నుంచి కబ్జాదారులను నిద్ర పోనివ్వడం లేదు. అక్రమ నిర్మాణాలను ఎక్కడికక్కడ నేలమట్టం చేస్తూ ముందుకు దూసుకెళ్తూనే ఉంది. వందలాది అక్రమ కట్టడాలను కూల్చివేసిన హైడ్రా.. ఇప్పుడు తన టార్గెట్‌ను చేంజ్ చేసినట్లుగా తెలుస్తోంది. మరో కొత్తరకం ఆపరేషన్‌కు రెడీ అయింది. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు, విల్లాలను తన బుల్డోజర్లతో కూల్చిన హైడ్రా.. ఇప్పుడు తన లక్ష్యాన్ని మార్చుకుంది.హైదరాబాద్ అంటేనే విపరీతమైన ట్రాఫిక్. ఏ గల్లీలో నుంచి ఎక్కడ ఎన్ని గంటల పాటు ఇరుక్కుంటామో కూడా తెలియదు. ఎక్కడికక్కడ రోడ్లపైనే పార్కిం గులు.. వచ్చిపోయే వాహనాలతో పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దాంతో వాహనదారులు నగర రోడ్లపై ప్రయాణిం చాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. అయితే.. హైడ్రా ఈ కష్టాలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ముఖ్యంగా నగర ట్రాఫిక్ వ్యవస్థతో కలిసి ట్రాఫిక్ జామ్‌కు స్వస్తి పలికే మార్గం ఎంచుకుంది. ట్రాఫిక్ సమస్యలను తొలగించేందుకు ట్రాఫిక్ విభాగంతో పనిచేయాలని నిర్ణయించింది. తొందరపడి రాజీనామా..! ఇందులో భాగంగా ఫుట్‌పాత్‌లను టార్గెట్ చేసింది. ఇప్పటిదాకా ఇళ్లను మాత్రమే కూల్చివేస్తూ వచ్చిన హైడ్రా.. ఇక నుంచి ఫుట్‌పాత్‌లపై దృష్టి సారించ బోతోంది. ఈ మేరకు ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్, ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాధ్ భేటీ అయ్యారు. వారి భేటీలో ఫుట్‌పాత్‌లపై కీలక నిర్ణయం తీసుకున్నారు. నగరంలో ఎక్కడెక్కడ ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయో ముందుకు వాటిని గుర్తించనున్నారు. ఆ తరువాత ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తారు. అనంతరం బుల్డోజర్ల సహాయంతో వాటిని కూల్చబోతున్నారు. అయితే.. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ప్రభుత్వ కట్టడాలు ఉన్నా కూడా.. వాటినీ కూల్చివేయాలని నిర్ణయం తీసుకున్నారు. డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని కూడా హైడ్రా నిర్ణయించింది. వర్షం పడినప్పుడల్లా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకునేందుకు సిద్ధం అయ్యారు. తక్షణమే నీరు తొలగించేలా హైపవర్ మోటార్లనూ వినియోగించనున్నారు. ఈ నీటిని తొలగించంతోపాటు.. వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం లాంటి పనులనూ చేపట్టబోతున్నారు. ఒకవేళ అక్కడ కొత్త లైన్లు అవసరం పడితే వేసేందుకూ నిర్ణయించారు. హైడ్రా తాజా నిర్ణయంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తీరడమే కాకుండా.. ఫుట్‌పాత్‌లపై పాదాచారులు స్వేచ్ఛగా నడుచుకుంటూ వెళ్లే వెసులుబాటు కలుగుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# అసమ్మతిరాగాలు?

(1వపేజీ తరువాయి)ధర్మపురి అర్వింద్ సైతం అలాంటి వ్యాఖ్యలే చేశారు. దీంతో వీరిద్దరి వ్యాఖ్యలు ఇప్పుడు పార్టీలో పెనుదుమారం రేపాయి. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు సాధించిన పార్టీకి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన స్థానాలు రాకపోవడానికి కారణాలు ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలో వస్తుందనుకున్న పార్టీ కేవలం 8 సీట్లకు ఎందుకు పరిమితం కావల్సి వచ్చిందని అడిగారు. దీనికి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాదు.. బాధ్యులెవరో తేల్చాలంటూ డిమాండ్ చేశార్చు. రాష్ట్ర నాయకత్వం ఆలోచనలో పడింది. వీరి వెనుకాల ఎవరైనా ఉండి ఈ వ్యాఖ్యలు చేయించారా..? లేదంటే సొంతంగా చేశారా..? అనే సందిగ్ధంలో ఉండిపోయింది. అటు వీరి వ్యాఖ్యల వెనుక ఉన్న ఆంతర్యమేంటరి పార్టీలోనూ చెవులు కొరుక్కుంటున్నారు. అర్వింద్ ఎవరిని టార్గెట్ చేసి ఈ వ్యాఖ్యలు చేశారా అని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. అందులోభాగంగా రాష్ట్రంలో 50 లక్షల సభ్యత్వాల టార్గెట్ విధించింది. అయితే.. మరో వారం రోజుల్లో ఆ గడువు ముగియనుంది. కానీ.. లక్ష్యం మాత్రం కేవలం 20 లక్షల దగ్గరే ఆగిపోయింది. దాంతో లక్ష్యం పూర్తికాక తల పట్టుకుంటున్న రాష్ట్ర అధినాయకత్వానికి ఇప్పుడు ఈ ఇద్దరి నేతల వైఖరి మరింత తలపోటుగా మారింది. పార్టీ గెలుపు ఓటములు ఏమైనా ఉంటే అది అంతర్గతంగా మాట్లాడుకో వాల్సిన అంశం. కానీ.. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజలు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎందుకు వేయలేదని కామెంట్స్ చేయడంపై ఇప్పుడు చర్చకు దారితీసింది. వాస్తవానికి గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ 48 స్థానాల ను గెలుచుకుంది. అదే అసెంబ్లీ ఎన్నికల్లో మా త్రం ఒక్క స్థానానికే పరిమితం అయింది. మరో వైపు.. ధర్మపురి అర్వింద్ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసమే సంచలన వ్యాఖ్యలు చేశారని టాక్ నడుస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్‌ని పక్కకు జరిపినప్పుడే ఆయన అధ్యక్ష పదవిని ఆశించారు. కానీ.. అధిష్టానం మాత్రం కిషన్ రెడ్డికే పగ్గాలు అప్పజెప్పింది. ఇప్పుడు రాష్ట్ర అధ్యక్షుడిని మార్చే అవకాశాలు ఉండడంతో ఏదో ఒక వ్యాఖ్యలు చేసి సెన్సేషనల్ అయ్యేందుకే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్న అభిప్రాయాలు పొలిటికల్ సర్కిల్‌లో వినిపిస్తున్నాయి.

# బాస్ వస్తున్నారు!

(1వపేజీ తరువాయి)వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. కానీ.. అవేవీ ప్రజలను పెద్దగా ఆకట్టుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఎన్ని విధాల నిరసనలు తెలిపినా.. ఎన్ని ప్రెస్ మీట్లు పెట్టినా.. ఎన్ని ప్రకటనలు ఇచ్చినా.. కనీసం ఆ పార్టీ కార్యకర్తల్లోనూ భరోసా నింపలేకపోతున్నా యని పార్టీలోనే గుసగుసలు నడుస్తున్నాయి. కేసీఆర్ లాంటి మాస్ ఫీలింగ్ ప్రజల్లో తీసుకురావడంలో ఫెయిల్ అవుతున్నారన్న అపవాదు ఉంది. మరోవైపు.. కేటీఆర్, హరీశ్ వ్యాఖ్యలకు కూడా రేవంత్ రెడ్డి ఎక్కడికక్కడ రివర్స్ అటాకింగ్ చేస్తున్నారు. వారి మాటలకు దీటుగా బదులిస్తూ వస్తున్నారు. చివరగా ప్రజల్లో బీఆర్ఎస్‌పై వ్యతిరేకతను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ కనిపిస్తోంది. అయితే.. పది నెలలుగా ఫామ్‌హౌజ్‌లోనే ఉండిపోయిన కేసీఆర్ ప్రజల్లోకి అప్పుడు వస్తారు.. ఇప్పుడు వస్తారు అంటూ లీకులు ఇస్తున్నారు తప్పితే ఇంతవరకు ఆయన వచ్చింది లేదు. కానీ ప్రజలు మాత్రం ఆయన రాకకోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. ఆయన స్పీచులు కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. మరోవైపు రోజురోజుకూ పార్టీ పరిస్థితి ఇబ్బందికరంగా మారుతున్నదని.. ఇప్పటికైనా రావాలని ఆయన అభిమానులు కోరుతున్నారు. పార్టీకి మునుపటి ఊపు రావాలంటే తప్పనిసరిగా కేసీఆర్ ప్రజాక్షేత్రంలోకి రావాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. కేసీఆర్ వస్తేనే పూర్వవైభవం చూస్తామని అంటున్నారు. మరోవైపు.. రేవంత్‌ను తట్టుకోవాలంటే కూడా అది కేసీఆర్ వల్లే అవుతుందని అంటున్నారు. కేసీఆర్ వస్తేనే రేవంత్‌ను సైలెంట్ చేయొచ్చని అభిప్రాయమూ వ్యక్తం అవుతోంది. రేవంత్ రెడ్డిని ఎదుర్కోవాలంటే కేసీఆరే ఉండాలి.. కేసీఆర్‌ను ఎదుర్కోవాలంటే రేవంత్ రెడ్డి ఉండాలని అంటున్నారు. అందుకే కేసీఆర్ బయటకు రావాలని క్యాడర్ మొత్తం కోరుకుంటోంది. లేదంటే పార్టీ ఉనికి కష్టం అయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. తాజాగా కేసీఆర్ ప్రజల్లోకి రావడంపై మరో ప్రచారం మొదలైంది. డిసెంబర్‌తో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి సంవత్సరం పూర్తవుతుంది. దాంతో ఆ సంవత్సరం కాలంలో కాంగ్రెస్ చేసిన పనులు.. చేసిన అప్పులు.. చేపట్టిన ప్రయోజనాలపై స్టడీ చేసి నిలదీసేందుకు వస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కేసీఆర్ రాకకు డిసెంబర్ ముహూర్తం ఖరారు అయినట్లుగా బీఆర్ఎస్ వర్గాలు సైతం వెల్లడిస్తున్నాయి. మరోవైపు.. డిసెంబర్ లేదంటే జనవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో ఇదే సరైన సమయం అని కేసీఆర్ కూడా నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. రైతుల సమస్యలపై, హైడ్రా అంశంతోప్రతి అంశంపై ఆయన మాట్లాడుతారన్న టాక్ నడుస్తోంది. కేవలం ప్రెస్‌మీట్లకే పరిమితం కాకుండా ప్రత్యక్ష ఆందోళనల్లోనూ పాల్గొంటారని తెలుస్తున్నది. అందులో భాగంగానే జిల్లా యాత్రలకు కూడా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చేలోపే పార్టీ బలోపేతం పైనా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు సమాచారం.

## జీవీఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి?

(1వపేజీ తరువాయి)ఆమ్రపాలికి గుర్తింపు ఉంది. దాంతో విశాఖ వంటి మెగా సిటీ అభివృద్ధికి ఆమె సేవలకు ఉపయోగించుకోవాలని చూస్తున్నారని భోగట్టా. అంతే కాదు దానికి కారణం ఏంటి అంటే ఆమె కొన్నాళ్ళ పాటు చదువుకున్నారు. విశాఖ గురించి ఆమెకు బాగా తెలుసు అని అంటున్నారు. ఆమె సొంత జిల్లా ఒంగోలు అయినా విశాఖ మీద అవగాహన పూర్తిగా ఉంది అని అంటున్నారు. అదే విధంగా ఆమె తండ్రి కాటా వెంకట రెడ్డి ఏయూలో ఎకనామిక్స్ ప్రొఫెసర్ గా సేవలు అందించారు. ఉమ్మడి ఏపీలో ఆమె విధులలో చేరగా విభజన తరువాత సర్వీస్ అంతా తెలంగాణా రాష్ట్రంలోనే సాగింది. వికారాబాద్ సబ్ కలెక్టర్ గా ఆమె తొలి పోస్టింగ్ గా ఉంది. అక్కడ ఆమె తన పనితీరుతో ఎన్నో సంచలనమైన నిర్ణయాలు తీసుకుని భేష్ అనిపించుకున్నారు. ఇక ప్రధానమంత్రి ఆఫీస్ లో డిప్యూటీ సెక్రటరీగా ఆమె కొంతకాలం పనిచేశారు. ఆమెని ఇపుడు విశాఖకు కమిషనర్ గా నియమిస్తే కనుక తప్పనిసరిగా అభివృద్ధితో పాటు విశాఖ జీవీఎంసీలో పాలనను ఒక గాడిలో పెడతారు అని అంటున్నారు. విశాఖకు టీడీపీ కూటమి ప్రభుత్వం కూడా తగిన ప్రాధాన్యత ఇస్తోందని దానికి అనుగుణంగా సమర్ధవంతమైన అధికారిని నియమించాలని అనుకుంటోందని చెబుతున్నారు అయితే ఆమ్రపాలిని పంచాయతీ రాజ్ శాఖలో కీలక పదవిలోకి తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఆలోచిస్తున్నారు అని అంటున్నారు పంచాయతీ రాజ్ పేషీలో మంచి అధికారులను పెట్టి ఉత్తమ పాలనకు తెర తీస్తున్న పవన్ కళ్యాణ్ సైతం ఆమ్రపాలి వైపు చూస్తున్నారు ప్రచారం సాగుతోంది. మొత్తం మీద చూస్తే ఈ యువ అధికారిణి ఎక్కువ శాతం విశాఖ కార్పొరేషన్ కమిషనర్ గా వచ్చే చాన్స్ ఉందని అంటున్నారు. అలా కాకపోతే కనుక పంచాయతీ రాజ్ లో ముఖ్య బాధ్యతలు స్వీకరిస్తారు అని అంటున్నారు. ఏపీ నుంచి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ గా ఉన్న జి సృజన తెలంగాణాకు వెళ్తున్నారు. కాబట్టి అక్కడ నుంచి వచ్చిన మంచి అధికారులను కీలక విభాగాలలో వాడుకోవాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది అని అంటున్నారు.

## ఏపీ బడ్జెట్‌కు కసరత్తు

(1వపేజీ తరువాయి)సంక్షేమానికి అదనపు కేటాయింపులు!

ఎన్నికల్లో ఎన్డీయే కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు భారీగా సంక్షేమ పథకాల అమలుకు హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే వృద్ధాప్య, ఇతర పెన్షన్ల మొత్తాన్ని పెంచి అమలు చేస్తున్నారు. మిగిలిన సంక్షేమ పథకాల అమలుపై ఆర్థికశాఖ కసరత్తు చేస్తోంది. జగన్ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వ్యయం కన్నా మరో రూ.20 వేల కోట్ల వరకు అదనంగా ఖర్చవుతుందని అధికారులు లెక్క తేల్చినట్లు సమాచారం. నవంబరు నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీ కూడా అమలు కాబోతోంది. రాబోయే నాలుగు నెలల్లో ఏ పథకం ఎలా అమలు చేయబోతున్నారో బడ్జెట్‌లో రూపురేఖలు వెల్లడిస్తారు. ఆయా పథకాల విధివిధానాలు, లబ్ధిదారుల సంఖ్య ఆధారంగా అంచనా వ్యయాలు రూపొందించారు. ప్రస్తుతం నిరుద్యోగభృతికి ఎంత వ్యయమవుతుందో అంచనాలు రూపొందించినా భవిష్యత్తులో ఉపాధి కల్పన మేరకు ఈ భారం తగ్గుతుందనే అంచనాలో ఉన్నారు. సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారులు సూచనప్రాయంగా వెల్లడిస్తున్నారు.

**రూ.2.90 లక్షల కోట్లతో పూర్తి స్థాయి పద్దు!**

వాస్తవానికి చివరి నాలుగు నెలల కాలానికి బడ్జెట్ ఖర్చులకు ఆమోదం తీసుకోవాల్సి ఉన్నా.. ఏడాది మొత్తానికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిందే. దాదాపు రూ.2.90 లక్షల కోట్ల మేరకు బడ్జెట్ ఉండొచ్చని ప్రాథమిక సమాచారం. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో పెద్దపీట వేయనున్నారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులు కీలకం కానున్నాయి. కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా కూడా వివిధ పథకాలకు బడ్జెట్‌లో నిధులు చూపబోతున్నారు. కేంద్ర పథకాలకు, రాష్ట్ర వాటా నిధులు సమకూరుస్తూ దాదాపు 28 పథకాల కింద పనులు చేయబోతున్నారు. ప్రస్తుతం ఆర్థికశాఖ కార్యదర్శి ఆయా ప్రభుత్వ శాఖలతో ప్రతిపాదనలపై కూలంకషంగా చర్చిస్తున్నారు. తదుపరి దశలో మంత్రుల స్థాయి సమావేశాలు ఉంటాయని సమాచారం.

## ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలబడాలి

(1వపేజీ తరువాయి)వారే. కుటుంబంలోనే భేదాభిప్రాయాలు ఉంటాయి. ఫ్యామిలీని ఐక్యంగా ఉంచేందుకు ఇంటిపెద్ద ఆలోచిస్తుంటారు. రాజకీయ పార్టీ కూడా అంతే. నాపై ఆ బాధ్యత ఉంది. అధికారంలోకి రాగానే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశాం. రాష్ట్రంలో ఏ అరాచకం చూసినా దాని వెనుక గంజాయి బ్యాచ్ ఉంటుంది. కేంద్రంలో అనుకూల ప్రభుత్వం వచ్చింది కనుక నిలదొక్కుకుంటున్నాం. 16,437 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. వచ్చే ఫిర్యాదుల్లో 70 శాతం భూ ఆక్రమణలపైనే ఉన్నాయి. అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. ప్రజలు మనల్ని అనుమానించే పరిస్థితి రాకూడదు. ప్రతి ఒక్కరికీ క్రమశిక్షణ ముఖ్యం. వరదలు వస్తే ఎలా పనిచేశామో చూశాం. యుద్ధప్రాతిపదికన పనులు చేశాం.. అందరినీ ఆదుకున్నాం.

**ప్రధాని మోదీ నుంచి నేర్చుకోవాలి**

చండీగఢ్‌లో హరియాణా సీఎం ప్రమాణస్వీకారం తర్వాత ఎన్డీయే సమావేశం నిర్వహించారు. ప్రధాని మోదీ 5 గంటల పాటు అక్కడ కూర్చున్నారు. మోదీ అంతసేపు ఉండాల్సిన అవసరం లేదు. కానీ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. మోదీ నుంచి నేర్చుకోవాలి. ఆయన పట్టుదల, కృషి వల్లే మూడోసారి ప్రధాని అయ్యారు. ఆరుసార్లు గుజరాత్‌లో భాజపా గెలిచింది. మూడోసారి హరియాణాలో విజయం సాధించారు. సమష్టిగా పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందారు. ఏం చేసినా ప్రజలను దృష్టిలో ఉంచుకుని చేశారు. దేశంలో ఎవరికీ దక్కని విజయం మోదీకి దక్కిందంటే దాని వెనుక కఠోరమైన శ్రమ, క్రమశిక్షణ ఉన్నాయి. ఎక్కడా తప్పు చేయకుండా పార్టీని ఆయన కాపాడుకుంటూ వస్తున్నారు”అని చంద్రబాబు కొనియాడారు.

**2 అంతస్థుల భవంతి అమ్మకం**

హైదరాబాద్ మన్సూరాబాద్‌లో రెండు అంతస్థుల భవనం అమ్మకానికి కలదు. ప్రస్తుతం 30వేల రూపాయల అద్దె ప్రతినెలా వస్తుంది. వాస్తుప్రకారం నిర్మాణం. ఈస్ట్ ఫేస్. ఆసక్తి ఉన్న వారు దిగువ సెల్ నెంబర్‌లో సంప్రదించండి.9246213493



# కోల్‌కతా ఆసుపత్రిలో అగ్నిప్రమాదం.. ఐసీయూలో రోగి మృతి



**న్యూఢిల్లీ–నవభూమి:** పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ఆసుపత్రిలో మంటలు చెలరేగి.. ఐసీయూలో ఉన్న రోగి మృతి చెందారు . సుమారు 80 మంది పేషెంట్లను అక్కడి నుంచి సురక్షితంగా తరలించారు. సెంట్రల్ కోల్‌కతాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈఎస్ఐ ఆసుపత్రిలోని ఓ వార్డులో చెలరేగిన మంటలు.. క్రమంగా ఆసుపత్రిలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించాయి. అప్రమత్తమైన ఆసుపత్రి వర్గాలు వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న 10 ఫైర్ ఇంజన్లు మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాద సమయంలో ఐసీయూ (%×జఖ%)లోని ఓ రోగి మరణించగా.. సుమారు 80 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు. రోగి మరణానికి ఖచ్చితమైన కారణం తెలియరాలేదు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని పేర్కొన్నారు. ఇది చాలా భయంకరమైన ఘటన అని అభివర్ణించారు. దాదాపు 80 మంది రోగులు లోపల చిక్కుకుపోయారని.. 20 నిమిషాల్లోనే వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు చెప్పారు. మంటల కారణంగా వార్డు మొత్తం పొగతో నిండిపోవడంతో.. రోగులు కిటికీల్లోంచి మమ్మల్ని రక్షించండి అంటూ అరుస్తున్నారని వివరించారు. మరోవైపు అగ్నిప్రమాద సమాచారం తెలుసుకున్న ఆ రాష్ట్ర అగ్నిమాపక, అత్యవసర సేవల మంత్రి సుజిత్ బోస్ హుటాహుటిన ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి గల కారణాలుతెలియరాలేదు.

## జమ్ముకశ్మీర్‌లో స్థానికేతర వ్యక్తిని కాల్చి చంపిన ఉగ్రవాదులు



**శ్రీనగర్–నవభూమి:** జమ్ముకశ్మీర్‌లో మరోసారి స్థానికేతర వ్యక్తిని ఉగ్రవాదులు కాల్చి చంపారు. శుక్రవారం ఉదయం రోడ్డు పక్కన బుల్లెట్ గాయాలతో పడి ఉన్న ఒక వ్యక్తిని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. మృతుడు బీహార్‌కు చెందిన వలస కార్మికుడిగా గుర్తించారు. దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం ఉదయం జైనాపోరాలోని వదునా ప్రాంతంలో రోడ్డు పక్కన స్థానికేతర వ్యక్తి బుల్లెట్ గాయాలతో మరణించడాన్ని స్థానికులు గమనించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు, ఆర్మీ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికేతర వ్యక్తిపై ఉగ్రవాదులు దాడి చేసినట్లు ధృవీకరించారు. మృతుడు బీహార్‌కు చెందిన వలస కార్మికుడిగా గుర్తించారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. అలాగే భద్రతా దళాలు, పోలీసులు కలిసి ఉగ్రవాదుల కోసం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేత ఒమర్ అబ్దుల్లా జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన రెండు రోజులకే ఈ సంఘటన జరిగింది.

## శిక్షించినా బాల్య వివాహాలు ఆగడంలేదు.. కమ్యూనిటీలో మార్పు రావాలి: సుప్రీంకోర్టు




**న్యూఢిల్లీ–నవభూమి:** బాల్య వివాహాల నిర్మూలన చట్టాల అమలు తీరుపై సుప్రీంకోర్టు (కీలక తీర్పును ఇచ్చింది. ఆ చట్టాల ద్వారా బాధితులను శిక్షించినా.. ప్రయోజనం జరగడం లేదని, అయితే కమ్యూనిటీ ఆధారంగా ఆ చట్టాలను అమలు చేయాలని సుప్రీం ధర్మాసనం పేర్కొన్నది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పర్దీవాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ కేసులో వాదనలు విన్నది. బాల్య వివాహాల చట్టాల అమలు తీరును ప్రశ్నిస్తూ ఓ ఎన్జీవో వేసిన పిల్‌పై సుప్రీంలో విచారణ జరిగింది. బాల్య వివాహం జరిపిన కేసుల్లో వ్యక్తులను శిక్షించినా.. పెద్దగా ఏమీ మార్పు జరగడం లేదని కోర్టు తెలిపింది. చట్టాలను అమలు చేయడం అంటే శిక్షించడమే కాదు అని కోర్టు పేర్కొన్నది. పీసీఎంఏ చట్టం అమలు విషయంలో వివిధ వర్గాల ప్రజల మధ్య సహకారం అవసరం అని కోర్టు తెలిపింది. చట్టాల అమలుతో లక్ష్యాలు సాధించేందుకు కొన్ని మార్గదర్శకాలను కోర్టు సూచించింది. తాము సూచించిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖకు ఆదేశాలు ఇచ్చారు.

## టమాటాలు రవాణా చేస్తున్న లారీ బోల్తా.. పోలీసులు ఏం చేశారంటే?




**లక్నో:–నవభూమి:** టమాటాలు రవాణా చేస్తున్న లారీ బోల్తాపడింది. దీంతో అందులోని టమాటా పెట్టెలు, టమాటాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రస్తుతం రేటు పెరిగిన టమాటాలను ఎవరూ ఎత్తుకెళ్లకుండా రాత్రంతా అక్కడ కాపలా కాశారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బెంగళూరు నుంచి ఢిల్లీకి 18 టన్నుల టమాటాలు రవాణా చేస్తున్న లారీ, మంగళవారం రాత్రి పది గంటల సమయంలో కాన్పూర్ సమీపంలో ప్రమాదానికి గురైంది. రోడ్డుపై ఆవును గుర్తించిన లారీ డ్రైవర్ దానిని తప్పించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో లారీ అదుపుతప్పి ఒక పక్కకు బోల్తాపడింది. లారీ క్లీనర్ స్వల్పంగా గాయపడ్డాడు. స్కూటీపై వెళ్తున్న మహిళ ఆ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. కాగా, లారీ బోల్తాపడటంతో అందులో రవాణా చేస్తున్న టమాటా బాక్స్‌లు రోడ్డుపై పడ్డాయి. దీంతో టమాటాలు చెల్లచెదురయ్యాయి. టమాటా లారీ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన మహిళను హాస్పిటల్‌కు తరలించారు. మరోవైపు ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో టమాటా ధర కిలో వందకు చేరింది. ఈ నేపథ్యంలో రోడ్డుపై పడిన టమాటాలను ఎవరూ ఎత్తుకెళ్లకుండా పోలీసులు రాత్రంతా అక్కడ కాపలా ఉన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## బర్త్‌డే పార్టీకి పిలిచి బట్టలిప్పమన్నారు.. ఆ తర్వాత ఏం జరిగిందంటే..



**కాన్పూర్:నవభూమి:** వారంతా ఒకే కాలేజీలో చదువుతున్నారు. పుట్టిన రోజు పార్టీ అని పిలిచారు. బట్టలిప్పాలని బెదిరించారు.. దానికి వారు నో చెప్పడంతో కర్రలు, బెల్టులు, ఐరన్ రాడ్లతో ఇష్టం వచ్చినట్లు చావబాదిన ఘటన మధ్యప్రదేశ్‌లోని కాన్పూర్‌లో జరిగింది. హెచ్‌బీటీయూ ఇంజినీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ ఫోర్త్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు.. తమ జూనియర్లు అయిన థార్డ్ ఇయర్‌కు చెందిన ఓ విద్యార్థికి ఫోన్ చేశారు. బర్త్‌డే పార్టీ చేసుకుందామని, తనతోపాటు మరో స్టూడెంట్‌ను తీసుకుని అబ్దుల్ కలాం హాస్టల్‌కు రావాలని పిలిచారు. దీంతో ఎంజాయ్ చేద్దామని అక్కడికి వెళ్లిన ఆ ఇద్దరిని.. బట్టలు విప్పాలని సీనియర్లు అడిగారు. దానికి వారు నిరాకరించారు. ఫస్ట్ ఇయర్‌లో చేరగానే తమను ర్యాగింగ్ చేశారని, మళ్లీ ఇప్పుడు ఎందుకు ఇలా చేస్తున్నారని అడిగారు.

# 60 మంది సెక్యూరిటీతో సల్మాన్ బిగ్ బాస్ షూటింగ్..!



**న్యూఢిల్లీ–నవభూమి:** లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి వరుస హత్య బెదిరింపుల నేపథ్యంలో బాలీవుడ్ స్టార్ నటుడు సల్మాన్ ఖాన్ భద్రతా వలయంలో ఉన్నారు. సల్మాన్ ఎక్కడికి వెళ్లినా.. ఆయన చుట్టూ భద్రతా సిబ్బందే కనిపిస్తున్నారు. షూటింగ్‌కు సైతం భద్రత మధ్యే వెళ్తున్నట్లు తెలిసింది.

వరుస హత్య బెదిరింపులు రావడంతో సల్మాన్ ఖాన్ ఇప్పట్లో ఎలాంటి షూటింగ్స్‌కూ హాజరు కాకపోవచ్చంటూ బాలీవుడ్ సర్కిల్‌లో వార్త చక్కర్లు కొట్టిన విషయం తెలిసిందే. అయితే, సల్మాన్ వాటన్నింటికీ చెక్ పెడుతూ గురువారం రాత్రి బిగ్ బాస్ షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టినట్లు తెలిసింది. ఇవాళ 'వీకెండ్ కా వార్' షూట్ చేయనున్నారు. ఇందుకోసం గురువారం రాత్రి సెట్‌లోకి అడుగుపెట్టిన సల్మాన్ అక్కడ ఆయన కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హౌస్‌లో బస చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియా పేర్కొంది.

సల్మాన్ షూటింగ్‌లో పాల్గొనే సమయంలో దాదాపు 60 మంది సెక్యూరిటీ (60 సెట్‌లో ఉండనున్నట్లు తెలిపింది. నటుడి భద్రతను వారు నిరంతరం పర్యవేక్షించనున్నారు. సల్మాన్ సెట్‌లో ఉన్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వారిని అందులోకి అనుమతించరు. షూట్ కోసం పని చేసే సిబ్బంది సైతం లోపలికి వచ్చే ముందు కచ్చితమైన ఆధార్ కార్డును చూపించాల్సి ఉంటుంది. ఇక షూట్ పూర్తయ్యే వరకూ లోపలి వ్యక్తులు ఎవరూ బయటకు వెళ్లేందుకు కూడా వీలు ఉండదు.

**బిష్ణోయ్ గ్యాంగ్ టార్గెట్ లిస్ట్‌లో..**

1998 కృష్ణ జింక కేసు నుంచి సల్మాన్ ఖాన్.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ టార్గెట్ జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఈ గ్యాంగ్ నుంచి సల్మాన్ అనేక సార్లు హత్య బెదిరింపులు ఎదుర్కొన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద కాల్పుల ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సల్మాన్ ఇంటి ముందు నాలుగు రౌండ్ల కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఇక ఈ కేసును దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జూన్‌లో మరోసారి సల్మాన్ హత్యకు కుట్ర జరిగింది. పన్వేల్ ఫామ్‌హౌస్ నుంచి ఇంటికి వెళ్తున్న మార్గంలో సల్మాన్‌పై దాడి చేయాలని ఈ గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో కొందరు అనుమానితుల్ని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ కూడా చేశారు.

**పక్కా ప్లాన్‌తోనే హత్యకు కుట్ర..**

ఇక ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. పోలీసులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సల్మాన్ హత్యకు బిష్ణోయ్ గ్యాంగ్ పక్కా ప్లానింగ్‌తో వ్యవహరిస్తోందని పోలీసులు ఛార్జిషీట్‌లో ప్రస్తావించారు. పంజాబీ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య తరహాలోనే కారులో సల్మాన్‌ను హత్య చేయాలని నిర్ణయించినట్లు పోలీసులు గుర్తించారు. రూ.25 లక్షల ఒప్పందం ప్రకారం సల్మాన్‌ను హత్య చేయాలనుకున్నారని, ఆగస్ట్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు నెలల పాటు ఈ హత్య ప్రణాళికను రూపొందించారని పోలీసులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.

పాక్ నుంచి తుపాకులు

నటుడి హత్యకు మోడ్రన్ వెపన్స్ కొనుగోలుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నిందితుల ముఠా ఏకే-47, ఎం16, ఏకే-92 తుపాకులు, హై-కాలిబర్ ఆయుధాలను వంటి అధునాతన మారణాయుధాలను పొరుగు దేశం పాకిస్థాన్ నుంచి కొనుగోలు చేయాలని భావించారని పోలీసులు పేర్కొన్నారు. సల్మాన్ హత్య కుట్రలో భాగంగా సల్మాన్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలు, బాంద్రాలోని నివాసం సహా షూటింగ్ ప్రదేశాల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన సుమారు 70 మంది రెక్కీ నిర్వహిస్తూ.. నటుడి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు విచారణలో తేలింది.

# ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు..
## అధికారులను ప్రశ్నిస్తున్న దర్యాప్తు బృందం



**న్యూఢిల్లీ–నవభూమి:** మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో మైసూర్ లోని ముడా కార్యాలయంపై ఈడీ అధికారులు దాడులు చేశారు . 12 మంది అధికారుల బృందం శుక్రవారం ఉదయం ముడా కార్యాలయంలో సోదాలు చేపట్టారు.

ముడా కమిషనర్ ఏఎన్ రఘునందన్ సహా సీనియర్ అధికారులతో సమావేశం అయ్యారు. భూ కేటాయింపు కేసులో ముడా అధికారుల ప్రమేయాన్ని నిర్ధారించేందుకు దర్యాప్తు సంస్థ అధికారులు వారిని ప్రశ్నిస్తున్నారు. అనంతరం కేసుకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది.

**ముడా చైర్మన్‌ రాజీనామా**

కాగా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ముడా చైర్మన్ కే మరిగౌడ బుధవారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిం దే. ముఖ్యమంత్రి ఆదేశాలతో పాటు తన అనారోగ్య సమస్యల వల్ల రాజీనామా చేస్తున్నానని, తనపై ఎలాంటి ఒత్తిడి లేదని ఆయన ప్రకటించారు. ముడా స్కామ్‌పై విచారణ కొనసాగుతున్నదని, అక్రమాలు జరిగాయా అనేది విచారణలో తేలుతుందని పేర్కొన్నారు. తాను 40 ఏండ్లుగా సిద్ధరామయ్యతో ఉన్నానని, ఆయనే తనను తాలుకా, జిల్లా పంచాయతీ అధ్యక్షుడిని చేశారని, చట్టవ్యతిరేక పనులు చేయమని ఆయన తనకు ఎప్పుడూ చెప్పలేదని అన్నారు. ఆయన రాజీనామా చేసిన రెండు రోజుల తర్వాత ఈ పరిణామం చోటు చేసుకుంది. ముడా స్కామ్‌లో సీఎంపై ఆరోపణలు..

మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూకుంభకోణం ఆరోపణలు కర్ణాటకలో గత కొన్ని నెలలుగా ప్రకంపనలు రేపుతున్నాయి. ఈ కేసులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు. ముడా నుంచి తన భార్యకు అనుచితంగా లబ్ధి కలిగించినట్లు సీఎంపై ఆరోపణలున్నాయి. దీంతో కుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపై లోకాయుక్త పోలీసులు, ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ వివాదం నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించిన 14 స్థలాలను ముడా అధికారులు ఇటీవలే వెనక్కి కూడా తీసుకున్నారు. ముడా కుంభకోణం నేపథ్యంలో, తనకు కేటాయించిన భూములను తిరిగి వెనక్కి తీసుకోవాలని సీఎం భార్య మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)కి లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ 14 ప్లాట్లను వెనక్కి తీసుకుంటూ సేల్‌డీడ్‌ను రద్దు చేయాలని ముడా ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఈ కుంభకోణం వ్యవహారంలో సిద్ధరామయ్యపై విచారణ కొనసాగుతోంది. ఇక ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయి విచారణను ఎదుర్కొంటున్న సీఎం సిద్ధరామయ్య ఏ క్షణంలోనైనా పదవిని కోల్పోతారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

## డేరా బాబాకు సుప్రీం షాక్




**న్యూఢిల్లీ–నవభూమి:** డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. 2015లో గురుగ్రంథ్ సాహిబ్‌ను అపవిత్రం చేశారనే ఆరోపణలపై నమోదైన కేసుపై పంజాబ్– హర్యానా హైకోర్టు ఇచ్చిన స్టేను అత్యున్నత న్యాయస్థానం శుక్రవారంనాడు తొలగించింది. దీంతో ఈ కేసు తిరిగి విచారణకు రానుంది. సుప్రీంకోర్టు 'స్టే' ఎత్తివేడంతో పాటు నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని డేరాబాబాను ఆదేశించింది. బర్గారీలో గురుగ్రంథ సాహెబ్‌ను అపవిత్రం చేశారనే ఆరోపణలను డేరా బాబా ఎదుర్కొంటున్నారు. దీనిపై మూడు కేసులు నమోదు కాగా, విచారణపై హైకోర్టు గత మార్చిలో స్టే ఇచ్చింది. దీనిని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. డేరాబాబాకు ఇప్పటికే హత్యాచారం, హత్య కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష పడంది. హర్యానాలోని రోహ్‌తక్ సునారియా జైలులో ఆయన శిక్ష అనుభవిస్తున్నారు.

## భారత్‌లో బంగారం ధరలు గురువారం చరిత్రలో తొలిసారిగా ఆల్‌టైమ్ హైకి

**న్యూఢిల్లీ–నవభూమి:** మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.76,899 వద్ద ట్రేడవుతున్నది. అయితే, బంగారం పెరుగుదలను కారణాలు అనేకం ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇందులో ప్రధానంగా సెంట్రల్ బ్యాంకుల వైఖరి, బాండ్ ఈల్డ్‌లను తగ్గించడం, పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కారణాలని పేర్కొంటున్నారు. కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ మాట్లాడుతూ బంగారం ధరలు ఆల్‌టైమ్ హైకి చేరుకునేందుకు సెంట్రల్ బ్యాంకుల దృక్పథం, బాండ్ ఈల్డ్‌ల తగ్గింపుతో బులియన్ మార్కెట్‌లో డిమాండ్ పెరిగి మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో బంగారం ధర రూ.76,899 ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయిని తాకిందన్నారు. ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది మరోసారి వడ్డీ రేట్లను తగ్గించవచ్చని భావిస్తున్నారు. గత నెలలో వడ్డీ రేట్లలో కోత విధించిన విషయం తెలిసిందే. నవంబర్‌లోనూ 25 బేసిస్ పాయింట్లు కోత పెట్టే అవకాశం ఉందని అంచనా. ఇంకా అమెరికా అధ్యక్ష ఎన్నికలు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల కారణంగా బంగారం ధరలు పెరిగాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు పెరుగుతున్నాయని కొటక్ సెక్యూరిటీస్ కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనాట్ చైన్‌వాలా తెలిపారు. యూఎస్ ట్రెజరీ దిగుబడులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య కామెక్స్‌లో బంగారం ధరలు పెరిగాయన్నారు.

. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు.. లెబనాన్‌లోని హిజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడుల తర్వాత కామెక్స్‌లో బంగారం 0.5శాతం పెరిగి ఔన్స్‌కు 2,691.30 వద్ద ముగిసిందని చెప్పారు. బంగారం అదే ట్రెండ్‌ను కొనసాగిస్తే ప్రారంభ సెషన్‌లో 2,700.60 డాలర్లకు చేరుకుందన్నారు. త్వరలో జరుగబోయే అమెరికా ఎన్నికలపై అనిశ్చితి, కీలక ఆర్థిక డేటా అంచనాల కారణంగా బంగారం ధరలు పెరుగుతున్నాయన్నారు.

## చంపేస్తామంటూ బెదిరింపు సందేశం..
# సల్మాన్ ఖాన్ ఇంటి దగ్గర భద్రత పటిష్టం..



**ముంబై–నవభూమి:** 'సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా, లారెన్స్ బిష్ణోయ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా తమకు రూ.5 కోట్లు చెల్లించాలి. లేదంటే సల్మాన్ పరిస్థితి బాబా సిద్ధిఖీ కంటే దారుణంగా ఉంటుంది. ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోవద్దు' అంటూ ముంబై ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ నంబర్‌కు గురువారం రాత్రి ఒక మెసేజ్ వచ్చింది. దాంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. సల్మాన్ ఖాన్ ఇంటిదగ్గర భద్రతను పటిష్టం చేశారు. ఖాన్ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు కలిసి అక్కడ పహారా కాస్తున్నారు.

మరోవైపు బెదిరింపు మెసేజ్ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలావుంటే సల్మాన్ ఖాన్ హత్యకు కుట్ర పన్నిన కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. హర్యానాలోని పానిపట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. 1998లో సల్మాన్ ఖాన్ కృష్ణ జింకను వేటాడటంతో అటు కేసులో ఇరుక్కోవడమే కాకుండా ఇటు లారెన్స్ బిష్ణోయ్ గాంగ్‌కు టార్గెట్‌గా మారారు. కృష్ణ జింకను బిష్ణోయ్ వర్గం ప్రజలు దైవంలా భావిస్తారు. ఈ నేపథ్యంలో సల్మాన్ ఖాన్ కృష్ణ జింకను వేటాడటం లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు ఆగ్రహం తెప్పించింది. అప్పటి నుంచి సల్మాన్ ఖాన్‌ను హత్య చేసేందుకు ఆ గ్యాంగ్ కుట్రలు పన్నుతూనే ఉంది. గత జూన్‌లో కూడా బైక్‌పై సల్మాన్ ఖాన్ గెలాక్సీ అపార్టుమెంట్ వద్దకు వచ్చిన ఇద్దరు దుండగులు నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనపై దర్యాప్తు సాగుతుండగానే బాబా సిద్ధిఖీ హత్య, సల్మాన్‌కు బెదిరింపుల ఘటనలు చోటుచేసుకున్నాయి.

## క్యాన్సర్ ఆట కట్టించే వ్యాక్సిన్!

**న్యూయార్క్–నవభూమి:** క్యాన్సర్ వ్యాధి చికిత్స దిశగా అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. ప్రాణాంతక క్యాన్సర్‌ను నివారించే బ్యాక్టీరియల్ వ్యాక్సిన్‌ను వీరు అభివృద్ధి చేశారు. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ. కొలి బ్యాక్టీరియాను మార్చి ఈ వ్యాక్సిన్‌లో ఉపయోగించారు. క్యాన్సర్ కణాలపై దాడి చేసేలా శరీర రోగ నిరోధక వ్యవస్థను ఈ ప్రొబయోటిక్ బ్యాక్టీరియా సిద్ధం చేస్తుందని పరిశోధకులు తెలిపారు.

ఈ వ్యాక్సిన్ శరీరంలో బ్యాక్టీరియా నియోయాంటిజెన్స్ అనే ప్రొటీన్ లక్ష్యాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి క్యాన్సర్ కణాలను పోలి ఉంటాయి. క్యాన్సర్ కణాలను గుర్తించి, దాడి చేసేలా రోగ నిరోధక వ్యవస్థను నియోయాంటిజెన్లు సిద్ధం చేస్తాయి. ఒకవేళ శరీరంలోని లక్ష్యాన్ని గుర్తించడంలో విఫలమైతే ఈ వ్యాక్సిన్‌ను వెంటనే శరీరం నుంచి తొలగించవచ్చని, తద్వారా రోగ నిరోధక వ్యవస్థకు నష్టం ఉండదని పరిశోధకులు తెలిపారు.

ప్రీక్లినికల్ ప్రయోగాల్లో భాగంగా ఎలుకలపై ఈ వ్యాక్సిన్‌ను పరీక్షించారు. అడ్వాన్స్‌డ్ కొలొరెక్టల్ క్యాన్సర్‌తో పాటు మెలనోమా(చర్మ క్యాన్సర్)కు సంబంధించిన కణాలు వృద్ధి చెందకుండా, పూర్తిగా నిర్మూలించే సామర్థ్యం ఈ వ్యాక్సిన్‌కు ఉన్నట్టు తేలిందని పరిశోధకులు చెప్పారు. తద్వారా భవిష్యత్తులో మళ్లీ క్యాన్సర్ తిరగబడకుండా చూడొచ్చని చెప్తున్నారు. పెప్టైడ్ ఆధారిత క్యాన్సర్ వ్యాక్సిన్‌ల కంటే బ్యాక్టీరియల్ వ్యాక్సిన్ సమర్థంగా పని చేయగలదని తెలిపారు.

రోగిలో ఉన్న నిర్దిష్ట క్యాన్సర్ రకానికి తగ్గట్టుగా ఈ వ్యాక్సిన్‌ను మార్చే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెప్పారు. ముందుగా రోగి కణితి లక్షణాలను గుర్తించి, దానికి తగ్గ ప్రత్యేకమైన నియోయాంటిజెన్‌లను ఉత్పత్తి చేసేలా బ్యాక్టీరియాను మార్చాల్సి ఉంటుందని తెలిపారు.

# రాధికా మర్చంట్ బర్త్‌డే పార్టీ..
## హాజరైన ధోనీ ఇతర స్టార్స్.. ఫొటోలు వైరల్




**ముంబై–నవభూమి:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వివాహం ఇటీవలే అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. రాధికా మర్చెంట్ తో అనంత్ వివాహం జులైలో జరిగింది. పెళ్లైన తర్వాత రాధికా మర్చంట్ తొలిసారి అత్తారింట్లో తన 30వ పుట్టిన రోజును ఘనంగా జరుపుకుంది. బుధవారం రాత్రి ముంబైలోని అంబానీ నివాసం ఆంటిలియాలో జరిగిన ఈ బర్త్‌డే బాష్‌కు పలువురు స్టార్స్ హాజరై సందడి చేశారు. %బుధవారం రాత్రి రాధిక తన అత్తమామలు.. ముఖేశ్– నీతా అంబానీ, తల్లిదండ్రులు శైలా వీరేన్ మర్చెంట్, ఇషా అంబానీ, కోకిలా బెన్, ఆకాశ్– శ్లోకా సహా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి తన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఇంట్లో కేక్ కట్ చేసింది. ఈ పార్టీకి భారత మాజీ క్రికెటర్ ఎమ్ఎస్ ధోనీ స్టార్ నటులు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్, రణ్‌వీర్ సింగ్, అనన్య పాండే, ఒరీ, అర్జున్ కపూర్, శిఖర్ పహారియా, ఆర్యన్ ఖాన్, సుహానా ఖాన్, దర్శకుడు అట్లీ తదితరులు హాజరయ్యారు. రాధికకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఒరీ ఇన్‌స్టా వేదికగా షేర్ చేశారు. ప్రస్తుతం అవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.



## భారత్ మాతా కీ జై అంటేనే బెయిల్.. నిందితుడికి తిక్క కుదిర్చిన హైకోర్టు

**భోపాల్: -నవభూమి:** భారత వ్యతిరేక, పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసిన ఓ నిందితుడికి మధ్యప్రదేశ్ హైకోర్టు తిక్క కుదిర్చింది. అతడికి బెయిలు మంజూరు చేస్తూ ఊహించని షరతులు విధించింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది మే 17న ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. భోపాల్ సమీపంలోని మిస్రోద్‌లో ఓ పంక్చర్ షాప్ నిర్వహించే ఫైసల్‌ఖాన్ ఆ వీడియోలో 'పాకిస్థాన్ జిందాబాద్", 'భారత్ ముర్దాబాద్' అని నినాదాలు చేయడం కనిపించింది. దీంతో అతడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఫైసల్‌ఖాన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో తాజాగా మధ్యప్రదేశ్ హైకోర్టు జస్టిస్ దినేశ్ కుమార్ పలివాల్ అతడికి బెయిలు మంజూరు చేస్తూ.. ఫైసల్ తన దేశభక్తిని బహిరంగంగా ప్రదర్శించాలని షరతు విధించారు. జ ా తీ య ం జెండాకు 21సార్లు వందనం చేయాలని, నెలకు రెండుసార్లు 'భారత్ మాతా కీ జై' అని నినదించాలని షరతులు పెట్టారు. కేసు ముగిసే వరకు ప్రతినెల మొదటి, నాలుగో మంగళవారం మిస్రోద్ పోలీస్ స్టేషన్‌లోని జెండా స్తంభం వద్ద ఇలా చేయాలని ఆదేశిస్తూ ఫైసల్‌కు బెయిలు మంజూరు చేశారు.



## కెనడా పెడధోరణి

భారత్, కెనడా దేశాల మధ్య దౌత్య సంబంధాలు తీవ్రమైన కుదుపులకు లోనవుతున్నాయి. తాజాగా రెండు దేశాలు దౌత్యాధికారులను బహిష్కరించుకోవడం రెండు దేశాల విభేదాలకు పరాకాష్ఠగా చెప్పవచ్చు. ఖలిస్థాన్ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య ఈ పంచాయతీకి మూల కారణం. నిజ్జర్ హత్య వెనుక 'భారత్ ఏజెంట్ల' పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్టు గత ఏడాది సెప్టెంబర్‌లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రకటించడం దౌత్యపరమైన దుమారాన్ని రేపింది. 'అవి అర్థరహితమైన, దురుద్దేశపూరితమైన ఆరోపణలని' భారత్ అప్పట్లో ఖండించింది. ఇప్పుడు ట్రూడో ఒకడుగు ముందుకువేసి నిజ్జర్ హత్యను భారత ప్రభుత్వమే చేయించిందని, దౌత్యాధికారులు సంధానకర్తలుగా వ్యవహరించారని సంచలన వ్యాఖ్యలు చేశారు. హత్య కేసులో భారత హై కమిషనర్‌ను అనుమానితుడిగా పేర్కొంటూ ఆయన పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్టు ప్రకటించడంపై భారత్ తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఓట్ల రాజకీయంలో భాగంగానే ఆయన ఈ ఆరోపణలు చేశారని భారత విదేశాంగ శాఖ కొట్టిపారేసింది. అంతేకాదు, కెనడా తీరుకు నిరసనగా హై కమిషనర్‌ను వెనుకకు పిలిపించుకున్నది. 'ఓటు బ్యాంకు' రాజకీయంలో భాగంగానే ఆయన ఈ ఆరోపణలు చేశారని భారత విదేశాంగ శాఖ కొట్టిపారేయడం గమనార్హం. కెనడా జనాభాలో 2 శాతం వరకు, అంటే సుమారు 7.7 లక్షల మంది సిక్కులున్నారు. కాలక్రమంలో అక్కడి రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. ఇద్దరు సిక్కులు ట్రూడో మంత్రివర్గంలో సభ్యులుగా ఉండటమే ఇందుకు నిదర్శనం. దేశదేశాల్లో ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజలు రాజకీయంగా కీలక స్థానాల్లోకి ఎదగడం కొత్తేమీ కాదు. అగ్రరాజ్యం అమెరికాలో భారతీయ మూలాలు కలిగిన కమలా హ్యారిస్ ఉపాధ్యక్షురాలిగా గెలిచి ఇప్పుడు అధ్యక్ష పదవికి పోటీ పడటం మనం చూస్తున్నాం. కానీ, కెనడా విషయం వేరు. అక్కడి సిక్కుల్లో ఖలిస్థానీ వేర్పాటువాదులు కూడా ఉన్నారు. వారు కెనడా గడ్డపై నుంచి భారత వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తు న్నారు. అక్కడి ప్రభుత్వం వారికి ఆశ్రయం కల్పించి పరోక్ష మద్దతు అందిస్తున్నది. సుమారు నలభై ఏండ్ల కిందట కనిష్క విమానం పేల్చివేత మొదలుకొని ఇటీవలి కాలంలో దౌత్య కార్యాలయాలపై దాడుల దాకా భారత్ లక్ష్యంగా జరిగిన అనేక హింసాత్మక దాడులతో కెనడాలోని సిక్కు ఖలిస్థానీవాదులకు సంబంధాలున్నాయనేది బహిరంగ రహస్యమే. ఉగ్రవాదిగా భారత్ ప్రకటించిన నిజ్జర్ గతేడాది జూన్‌లో కెనడాలోనే హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు భారతే కారణమని కెనడా ఆరోపించింది. ఆధారాలుంటే చూపాలని భారత్ అంటుంటే, ఈసరికే బోలెడు ఆధారాలు చూపామని కెనడా వాదిస్తున్నది. వచ్చే ఏడాది జరుగనున్న ఎన్నికల్లో గెలుపు మీద దృష్టితోనే ప్రధాని ట్రూడో ఈ హత్యను రాజకీయం చేస్తున్నారనే విమర్శలు బలంగా వినవస్తున్నాయి. ఇప్పుడు భారత విదేశాంగ శాఖ అదే అంటున్నది. జనామోదంలో 31 శాతానికి పరిమితమైపోయి వెనుకబడిన ట్రూడో నిజ్జర్ అంశాన్ని తలకెత్తుకోవడం వెనుక కారణాల గురించి తలబద్దలు కొట్టుకోవాల్సిన అవసరం లేదు. ఖలిస్థాన్ సమర్థకుడైన జగ్మీత్‌సింగ్ నేతృత్వంలోని న్యూ డెమొక్రటిక్ పార్టీ గత వారమే ట్రూడో సర్కార్‌కు మద్దతు ఉపసంహరించింది. ఈ నేపథ్యంలో తన ఓటు బలం పెంచుకునేందుకు ఖలిస్థానీయుల మెప్పు కోసం ప్రధాని ట్రూడో భారత్‌పై విమర్శలు చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. సంకుచిత రాజకీయ ప్రయోజనం కోసం భారత్ వంటి దేశంతో సంబంధాలను బలిపెట్టడం వాంఛనీయం కాదు.

# తెలుగు పాఠం - ప్రగతికి పీఠం!

తెలుగుభాష మనుగడ, వినియోగంపై చర్చ మళ్లీ ప్రారంభమైంది. 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్', 'దేశభాషలందు లెస్స' అనిపించుకుంది తెలుగు. ఇది దక్షిణ భారతంలోని సంస్కృతి, చరిత్ర, సాహిత్యానికి ప్రతీక. ఆసియాలోని వివిధ దేశాలతో పాటు, దక్షిణాఫ్రికాలోని దర్బన్ నగర ఉన్నత పాఠశాలలోనూ తెలుగు రెండో భాషగా కొనసాగుతోంది. ఎంతో ఘనత కలిగిన ఈ భాష, భారత్‌లో పలువురు మాట్లాడే రెండో పెద్ద భాషగా ఖ్యాతి పొందింది. తల్లిభాషలో బోధన సాగితే- విద్యార్థులకు పాఠ్యాంశాలు, వాటి ప్రణాళిక పట్ల సరైన అవగాహన కలుగుతుంది. బోధన మొదట ప్రారంభమయ్యేది పాఠశాలలో కాదు, గృహంలో... అదీ మాతృభాషలో! అదే భాష బడిలోనూ కొనసాగితే, విషయ పరిజ్ఞానం విస్తరిస్తుంది. మాతృభాష తల్లిపాల వంటిది. ఇతర భాష పోతపాలతో సమానం. పాఠశాలలో విద్యార్థి మాతృభాష అక్కడ గృహ వాతావరణాన్ని కల్పిస్తుంది. అతడి భావ వ్యక్తీకరణకు అది ఎంతో ఉపయోగపడుతుంది.

**స్ఫూర్తిదాయక సేవ**

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7.5 కోట్లమంది పిల్లలకు మాతృభాషలో బోధన కరవవుతోందని 'యునెస్కో' వెల్లడించింది. ప్రాథమిక విద్యాబోధన పిల్లల మాతృభాషలోనే సాగితే, అభివృద్ధి తథ్యమని పేర్కొంది. మాతృభాషలోనే బోధనకు వనరులు పెంపొందించుకోవాలని, అటువంటి దేశాలే లక్ష్యాలు చేరుకోగలవని ఆ సంస్థ స్పష్టీకరించింది. మూడు లక్షలమంది మాట్లాడే 'చెరోకి' అనే ప్రాంతీయ భాష పరిరక్షణకు అమెరికా ప్రభుత్వం నడుం బిగించింది. దాదాపు 30 లక్షల డాలర్లు కేటాయించి, ఆయా పాఠశాలల్ని ప్రారంభించింది. ఆ నిధుల్ని ఉపాధ్యాయ శిక్షణకు, పాఠ్యప్రణాళికలు సిద్ధం చేయడానికి ఉపయోగించాలని విద్యాశాఖను ఆదేశించింది. అమెరికాలో స్థానిక తెగలు మాట్లాడుకునే ఒక భాష పరిరక్షణకు, అక్కడి ప్రభుత్వం సాగిస్తున్న ఈ తరహా కృషి భారత్ సహా అన్ని దేశాలకూ స్ఫూర్తిదాయకం. మాతృభాష పరిరక్షణ కోసం అందులోనే ప్రాథమిక విద్యాభ్యాసం సాగాలన్న సూత్రాన్ని అనేక దేశాలు విశ్వసిస్తున్నాయి. 1997 వరకు బ్రిటిష్ పాలనలో ఉన్న హాంకాంగ్‌లోనూ ఆంగ్లభాషతో సమానంగా స్థానిక 'కెంటోనీస్' భాషలోనూ విద్యాబోధన సాగింది. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు కలిగిన చైనాలో మాతృభాషను పరిరక్షిస్తూ, అన్ని పాఠశాలల్లోనూ ఆ భాషలోనే బోధన కొనసాగిస్తున్నారు. హాంకాంగ్ బోర్డు ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో చైనీస్ భాషతో పాటు ఆంగ్లంలోనూ చైనీయులు సమాన ప్రతిభ కనబరిచారు. స్వీడన్ వాసులు మాతృభాషలోనే విద్యాబోధన సాగిస్తూ, ఆంగ్లభాషలోని భావాన్ని అనువదించుకుంటూ ముందడుగు వేస్తున్నారు. జపనీస్- పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాల్లోనూ బోధనభాషగా ఉంటోంది. ఉత్తర, దక్షిణ కొరియాల్లోనూ ఇదే విధానం ఉంది. ఆనంద సూచికలో మొదటి స్థానం పొందిన ఫిన్‌లాండ్ దేశంలో ప్రాథమిక విద్య పూర్తిగా మాతృభాషలోనే సాగుతోంది. ఐస్‌లాండ్, నార్వే, రుమేనియా వంటిచోట్లా విద్యాబోధన మాతృభాషల్లోనే! ఫిలిప్పీన్స్, సింగపూర్, కాంబోడియా, వియత్నాం, థాయ్‌లాండ్, మలేసియా దేశాల పాఠశాలల్లో ప్రాథమిక విద్యాబోధన వారివారి తల్లిభాషల్లోనే కొనసాగుతోంది. ఆఫ్రికా దేశాలైన టాంజానియా, జింబాబ్వేలు మాతృభాషల్ని కాపాడుకుంటూ ప్రాథమిక స్థాయుల్లో తమ మాతృభాషల్లోనే బోధనలు సాగిస్తున్నాయి. ఇథియోపియా పాఠశాలల్లో విద్యాబోధనను పూర్తిగా వారి మాతృభాషలోనే నిర్వహిస్తున్నారు. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం అక్కడి మాతృభాషకే బోధనరంగంలో ప్రాధాన్యమిస్తూ ఇటీవల ఓ నూతన విధానం తెచ్చింది. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ తమ మాతృభాషల్లోనే గ్రంథాలు రచించారు. నోబెల్ సాహిత్య బహుమతులు అందుకున్నవారిలో అనేకులు తల్లిభాషలో రాసినవారే. విశ్వకవి రవీంద్రుడు ప్రాథమికంగా బెంగాలీలో రచించిన అనంతరం ఆంగ్లంలోకి తర్జుమా అయిన 'గీతాంజలి'కి నోబెల్ పురస్కారం లభించింది. విఖ్యాత కవి టాల్‌స్టాయ్ రచనలన్నీ మాతృభాషలోనివే. పలువురు సాహితీవేత్తలకు మాతృభాషల్లో అంత పట్టు లేకుంటే, ప్రపంచం అంత గొప్ప గ్రంథాల్ని చూసి ఉండేది కాదు. తల్లిభాషే మనిషి జీవితాన్ని ప్రతిబింబిస్తుందని మహాత్మాగాంధీ విశ్వసించారు. తన పన్నెండో ఏట వరకు మాతృభాష గుజరాతీలోనే చరిత్ర, లెక్కలు, భూగోళ శాస్త్రాలు చదివానని ఆయన ఆత్మకథలో రాసుకున్నారు. ఆ తరవాత పాఠశాల నిబంధనల ప్రకారం ఇతర భాషలు నేర్వాల్సి వచ్చిందని, అందుకు ఎంతో సమయం వృథా అయిందని ఆయన వెల్లడించారు.

**ఉభయ రాష్ట్రాల్లో కృషి**

పలు ప్రపంచ దేశాలు తమ మాతృభాషల్ని భావి తరాలకు కానుకలుగా అందించాలని శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. కానీ- ప్రాథమిక దశ నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు మాతృభాషలో ఒక్క ముక్కా నేర్చుకోకుండానే విద్యాభ్యాసం పూర్తిచేసే పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో ఉంది! దేశంలోని మరి ఏ ఇతర రాష్ట్రంలోనూ తల్లిభాష నేర్వకుండా ఉన్నతవిద్య పూర్తిచేసే అవకాశం లేదు. ఈ 'ఉపద్రవం' గమనించిన తెలంగాణ ప్రభుత్వం అన్ని పాఠశాలల్లోనూ ఒకటి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగును పాఠ్యాంశంగా బోధించాలన్న నిర్ణయం తీసుకొంది. ప్రాథమిక, మాధ్యమిక, ఇంటర్మీడియట్ పాఠ్య ప్రణాళికలు తయారుచేయాలని తెలుగు అకాడమిని ఆదేశించింది. ఎటువంటి పరీక్షలకైనా అకాడమీ పుస్తకాలే ప్రామాణికమని తెలియజేస్తూ, మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వం సంసిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం- మాతృభాష తెలుగుకానివారైనా, ఇతర మాధ్యమాల్లో అభ్యసించేవారైనా ఇకముందు తెలుగు పాఠ్యాంశాలను తప్పనిసరిగా చదవాలన్న నిబంధన తెస్తోంది. దీనికి సంబంధించి ఆ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. మాతృభాషకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యమిస్తుందని కర్ణాటక గతంలోనే ప్రకటించింది. మాతృభాషా వికాసానికి ఉపక్రమించిన తమిళులు ఇంజినీరింగ్‌లోని సివిల్, మెకానికల్ విభాగాల్లో తమ భాషాబోధన ప్రారంభించారు. తమిళ భాషలో పాఠశాల విద్యనభ్యసించినవారు 80 శాతం, ఆంగ్లంలో చదివిన 20 శాతం విద్యార్థులతో అక్కడి ఇంజినీరింగ్ సీట్లు భర్తీ కావడం గమనార్హం. డిగ్రీస్థాయిలో పూర్తిగా తమిళ మాధ్యమంలోనే బోధన కొనసాగిస్తామంటూ, ఆ రాష్ట్రంలోని అన్నా విశ్వవిద్యాలయానికి దాని అనుబంధ కళాశాలలు దరఖాస్తు చేసుకున్నాయి.

ఆంగ్ల, తమిళ అనువాదాల ప్రత్యేక నిఘంటువుల్ని తమిళ భాషాపండితులు ఇప్పటికే రూపొందించారు. ఇటువంటి వాటిని అంతర్జాలంలో అందుబాటులో ఉంచడం, భాషాసంబంధ సంశయ నివృత్తికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఒడిశాలోనూ ప్రాథమిక పాఠశాల బోధనను మాతృభాషలోనే కొనసాగిస్తున్నారు.

ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లోనూ మాతృభాషను ఒక అంశంగా విధిగా బోధించాల్సిందే. కేంద్రంతో తమిళనాడు ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించేటప్పుడు, ఆంగ్లంతో పాటు తమిళ ప్రతినీ తప్పనిసరిగా జతచేస్తోంది. తమిళ మాధ్యమ విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అయిదు శాతం మార్కుల్ని అదనంగా కలుపుతున్నారు. అక్కడ తమిళ మాధ్యమంలో చదవనివారికి రాష్ట్రస్థాయి ర్యాంకులు ఇవ్వరు. తెలుగు భాషలో బోధనను ఇతర భాషలతో బేరీజు వేసుకుంటే, పరిస్థితి అంత ఆశాజనకంగాలేదు. పదో తరగతిలో మాతృభాషలో రాసేవారు సగానికిపైగా తగ్గిపోయారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. విదేశాల్లో ఉన్న తెలుగువారు మాతృభాషా పరిరక్షణకు శ్రమిస్తున్నారు. అక్కడ తెలుగు సంఘాలు ఏర్పాటుచేసుకొని, ప్రైవేటుగా తెలుగు పాఠశాలల్లో తమ పిల్లలకు మాతృభాష నేర్పిస్తున్నారు. తెలంగాణలో తొమ్మిది లక్షలమంది ఇంటర్ చదువుతుండగా, వారిలో మాతృభాషలో బోధన అందుకుంటున్నవారు కేవలం మూడు లక్షలమంది! వారిలో లక్షా 80 వేల మంది ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు. ఒకటి నుంచి పదో తరగతి వరకు 60 లక్షలమంది విద్యార్థులుంటే, సగం మందే మాతృభాషలో విద్య అభ్యసిస్తున్నారు. దిల్లీలో ఓ తెలుగు సంస్థ నిర్వహిస్తున్న ఏడు పాఠశాలల్లో ఆ భాషను తప్పనిసరి చేశారు. మారిషస్‌లోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు కోర్సుకు గుర్తింపు లభించింది.

**నైపుణ్యాల పెంపుదల**

ఎంసెట్‌లో 25 శాతం, జేఈఈ మెయిన్స్‌లో 40 శాతం ఇంటర్ మార్కులకు వెయిటేజి ఉంది. దీంతో, కార్పొరేట్ కళాశాలలు తెలుగు బదులు ఇతర భాషలో పరీక్షలు రాయించి, విద్యార్థుల్ని మాతృభాష నుంచి దూరం చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని సీబీఎస్‌ఈ పాఠశాలల్లో నాలుగో తరగతి వరకు తెలుగు లేదు. అయిదో తరగతి నుంచి ఉన్నా, అది ఐచ్ఛికమే! ఇటువంటి పరిస్థితి ఉండటం వల్ల- ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో చదువు మొత్తాన్నీ తెలుగు రాకుండానే పూర్తిచేయవచ్చు! వాడుక భాషను, అందులో వస్తున్న మార్పులను ప్రభుత్వాలు దృష్టిలో పెట్టుకోవాలి. సామాజిక అనుబంధ సాహిత్యాన్ని ప్రోత్సహిస్తూ పాఠ్యప్రణాళికలో మార్పులు తేవాలి. అప్పుడే మాతృభాష వైపు పిల్లలు ఆకర్షితులవుతారు. మాతృభాషేతర బోధన ఉపాధ్యాయ కేంద్రీకృతంగా ఉంటోంది. తరగతి గదిలో నిశ్శబ్దం చోటుచేసుకుంటోంది.

# అస్సాం ఒప్పందం సెక్షన్ 6(ఎ) సమర్ధనీయం



సెక్షన్ 6( ఎ) మీద నిన్న సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు చాలా కీలకమైంది. గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి డి వై చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ సుందరేస్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ పార్థివాలా నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం నాడు 4:1 మెజారిటీ తీర్పుతో అస్సాంలోని అక్రమ వలసదారులకు భారత పౌరసత్వం మంజూరుకు సంబంధించిన పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6(ఎ) రాజ్యాంగ చెల్లుబాటును సమర్థించింది. అసోం ఒప్పందం అక్రమ వలసల సమస్యకు రాజకీయ పరిష్కారమని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ జె బి పార్థివాలా మాత్రం ఈ సెక్షన్ ఏకపక్షంగా ఉందని రాజ్యాంగ పరంగా చెల్లుబాటు కాదంటూ మైనారిటీ తీర్పు ఇచ్చారు.

**సెక్షన్ 6( ఎ) అంటే ఏమిటి ?**

1985 నాటి అస్సాం ఒప్పందాన్ని అనుసరించి 1985 పౌరసత్వ (సవరణ) చట్టంలో భాగంగా సెక్షన్ 6 (ఎ) రూపొందించబడింది. అస్సాం ఒప్పందం అనేది 1985లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్, ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ చర్చలు జరిపి అస్సాం ఒప్పందాన్ని రూపొందడం జరిగింది. అస్సాం స్టూడెంట్స్ యూనియన్ , ఆల్ అస్సాం గణ సంగ్రామ్ పరిషత్ లు 26 మార్చి 1971న పశ్చిమ పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విడిపోయిన తర్వాత బంగ్లాదేశీ వలసదారుల ప్రవాహానికి వ్యతిరేకంగా ఉద్యమించిన సమూహాలు. ఈ త్రైపాక్షిక ఒప్పందం సెక్షన్ 6(ఎ )అస్సాం కోసం ఒక ప్రత్యేక నిబంధనను రూపొందించింది. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 6 (ఎ) ప్రకారం 1 జనవరి 1966 నుండి 25 మార్చి 1971 మధ్య భారతదేశంలోకి ప్రవేశించి అస్సాంలో నివసిస్తున్న వ్యక్తులు తమను తాము పౌరులుగా నమోదు చేసుకోవడానికి అనుమతించబడతారు. రాష్ట్రంలో "సాధారణంగా నివాసం" ఉన్న విదేశీయులు 10 సంవత్సరాల పాటు ఓటు వేయలేరు తప్ప భారతీయ పౌరుల అన్ని హక్కులు, బాధ్యతలను కలిగి ఉంటారు.

కట్-ఆఫ్ తేదీ ఎందుకు అవసరం?

పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యానికి దారితీసిన బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం, భారతదేశానికి వలస వచ్చినవారి భారీ ప్రవాహాన్ని చూసింది. 1971లో తూర్పు పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందే ముందు కూడా భారతదేశానికి వలసలు మొదలయ్యాయి. అందుచేత ఈ కట్ ఆఫ్ తేదీ అవసరం.



**పౌరసత్వ చట్టం 1955 అంటే ?**

భారతదేశంలో పౌరసత్వ విషయాలను నియంత్రించేందుకు పార్లమెంటు పౌరసత్వ చట్టం 1955ను రూపొందించింది. ఇది భారత పౌరసత్వాన్ని ఎవరు పొందవచ్చో, ఏ ప్రాతిపదికన పొందవచ్చో నియంత్రిస్తుంది. అక్రమ వలసదారులు భారత పౌరసత్వం పొందడం నిషేధించబడింది. పౌరసత్వ చట్టం - 1955 అమలులోకి వచ్చినప్పటి నుండి ఆరుసార్లు సవరించబడింది. 1986, 1992, 2003, 2005, 2015, 2019 సంవత్సరాల్లో సవరణలు జరిగాయి. చివరిసారిగా 2019లో తాజా సవరణ ఏంటంటే " 31 డిసెంబర్ 2014లో లేదా అంతకు ముందు భారతదేశంలోకి ప్రవేశించిన ఆఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుండి హిందూ, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందిన కొంతమంది అక్రమ వలసదారులకు పౌరసత్వం మంజూరు చేయబడింది.

**కీలకం ఎందుకు ?**


ఈ తీర్పు చాలా కీలకమైంది.

మిగతా రాష్ట్రాల కంటే అస్సాంలో ఎక్కువ వలసలు ఉన్నాయి. అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం రాజకీయ పరిష్కారాన్ని చూపింది. కేవలం అస్సాంకే ఈ నిబంధన ఉండడం కీలకం.

**జనక మోహన రావు దుంగ**
**ఫోన్ 8247045230**

**భక్తి**

# కలిసుంటేనే కలదు సుఖం



దూరకుమీ బంధుజనుల.. అంటే బంధువులను దూషిస్తూ వారిని దూరం చేసుకోవద్దంటున్నారు బద్దెన. రామాయణంలో వాలిసుగ్రీవులు అన్నదమ్ములు. ఇద్దరూ బతికున్నంతకాలం దెబ్బలాడుకున్నారు. ఆఖరికి వాలి చచ్చిపోయాడు. సుగ్రీవుడు ఏడ్చాడు. ఏం ఉపయోగం? రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు అన్నదమ్ములు. విభీషణుడు చెప్పాడు, కుంభకర్ణుడూ చెప్పాడు... అయినా రావణాసురుడు వినలేదు. రావణుడు, కుంభకర్ణుడూ ఇద్దరూ మరణించారు. విభీషణుడు ఒక్కడే మిగిలిపోయాడు. ఎంత ఏడిస్తే మాత్రం ఆ అన్నదమ్ములు తిరిగొస్తారా !!!

ఎందరో చెప్పారు... స్వయంగా ధర్మరాజు చెప్పాడు, చిట్టచివరకు శ్రీ కృష్ణరాయబారం సమయంలో భీముడు కూడా చెప్పాడు. "మనం ఐదుగురం. ఆ దుర్యోధనాదులు నూరుగురు. అందరం అన్నదమ్ములం. పెదతండ్రి, పినతండ్రి పిల్లలం. మేం దెబ్బలాడుకోవడమేమిటి? మా మధ్య యుద్ధాలేమిటి? మాకు సాయం చేయడానికి దేశంలో రాజులందరూ రెండు పక్షాలుగా విడిపోవడమేమిటి? 18 అక్షౌహిణులతో మారణ హోమం ఏమిటి ? ఎందుకీ అన్నదమ్ముల కలహాలు...వద్దు... అందరం కలిసుందాం" అన్నాడు.. ధర్మరాజు,అర్జునుడు, నకులుడు, సహదేవుడు, గాంధారి, ధృతరాష్ట్రుడు, విదురుడు, అప్పుడక్కడికి వచ్చిన వ్యాసుడు, మైత్రేయుడు చెప్పారు. ఇంతమంది రుషులు, పెద్దలు, మంత్రులు, తండ్రి... ఎందరు చెప్పినా దుర్యోధనుడు వినలేదు. తమ్ముళ్ళమీద, అన్నగారు ధర్మరాజు మీద యుద్ధమే చేస్తానన్నాడు. చిట్టచివరకు తొడలు విరిగి యుద్ధభూమిలో పడిపోతే చనిపోబోయేముందు రాబందులు, గద్దలు పైన ఎగురుతుంటే... అప్పుడు ఏడ్చాడు. మహానుభావుడు, మా పినతండ్రి విదురుడు చెప్పిన మాట వినలేదు. అలా విని ఆ ఐదుగురితో సఖ్యంగా ఉంటే ఈవేళ అఖండ సామ్రాజ్యాన్ని పాలిస్తూ ఎంత గొప్పగా ఉండేవాళ్ళమో... మేం 105 మందిమి కలిసి ఉంటే... మాకు కీడు తలపెట్టడానికి మా వైపు కన్నెత్తి చూడగల వారెవరయినా ఉండేవారా? అది లేకపోగా నా తమ్ముళ్ళను నేనే చంపుకున్నా...పెద్దలు భీష్ముడు, ద్రోణుడు వంటి వారి మరణానికి నేనే కారణమయ్యా. ఆఖరుకు బంధువులతో గొడవలు పెట్టుకుని ఏం సాధించాను ?...అంటూ చిట్టచివరన ఏడ్చాడు... ఏం లాభం.. ఆఖరికి మరణించాడు. అయినవారు అందరూ మరణించారని మిగిలిన ఐదుగురు కూడా ఏడ్చారు. పార్వతీ పరమేశ్వరులు ఆది దంపతులు. నా కూతురుగా రమ్మని కోరుతూ దక్షప్రజాపతి తపస్సు చేస్తే ఆయనకు కూతురయి దాక్షాయణి అని పేరు పెట్టుకుంది. మామా అల్లుళ్ళు కలిసి ఉండాల్సిన వాళ్లు. అక్కర్లేని గొడవలకు వెడితే... నిండు సభలో శివుడిని అవమానించాడు. అల్లుడిని ఇంత అమర్యాద చేసిన వాడివి ఇంక నీకు గౌరవం ఉండమంటే ఎక్కడుంటుంది.. ఇక నీ కూతురుగా ఉండలేను అంటూ దాక్షాయణి యోగాగ్నిలో దూకేసింది. శంకరుడికి కోపమొచ్చింది. దక్ష ప్రజాపతికి తలకాయ పోయింది. గొర్రె తలకాయతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. శివపార్వతుల శక్తేమిటో తెలుసుకోలేక కేవలం అల్లుడన్న చిన్నచూపుతో అంతటి ఉపద్రవాన్ని కొనితెచ్చుకున్నాడు. కాబట్టి బంధువులు దెబ్బలాడుకోకూడదు. ఎప్పుడూ ప్రేమానురాగాలతో ఉండాలి. ఒకరిమీద ఒకరు అదేపనిగా దోషాలు, లోపాలు ఎంచే ప్రయత్నం చేయడం, చాడీలు చెప్పుకోవడం, ఫిర్యాదులు చేసుకోవడం, కేసులు పెట్టుకోవడం ఎన్నటికీ మంచి పద్ధతి కాదు. రామాయణం చదవండి, భాగవతం చదవండి, భారతం చదవండి.. అప్పటినుంచి ఇప్పటివరకు ఎన్నోసార్లు నిరూపితమయిన సత్యం ఇది. మేం 105 మందిమి కలిసి ఉంటే... మాకు కీడు తలపెట్టడానికి మా వైపు కన్నెత్తి చూడగల వారెవరయినా ఉండేవారా? అది లేకపోగా నా తమ్ముళ్ళను నేనే చంపుకున్నా.. పెద్దలు భీష్ముడు, ద్రోణుడు వంటి వారి మరణానికి నేనే కారణమయ్యా.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 హైదరాబాద్ శనివారం 19 । అక్టోబర్ । 2024

## ఆహారమే ఔషధం

వర్షంలో తడవడం, చలి గాలులు, సీజనల్ మార్పుల కారణంగా అనారోగ్యానికి గురవుతుంటాం. అయితే పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా ఈ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.క్యారెట్, అల్లం, మిరియాలు, పైనాపిల్, వెల్లుల్లి జలుబుని నియంత్రించడంలో సహాయపడతాయి. ముక్కుదిబ్బడ, ఆస్తమా నుంచి ఉపశమనం అందిస్తాయి.యాపిల్, కీర, క్యాబేజీ, అల్లం, ఆకుకూరలు తలనొప్పిని తగ్గిస్తాయి. అల్సర్ సంబంధిత సమస్యలను, డయాబెటిసను నివారిస్తాయి. ఆకు కూరలు, క్యారెట్, చేపలు



కంటిచూపును మెరుగుపరుస్తాయి.
పుచ్చకాయ, కీరా, క్యారెట్ తరచుగా తింటే మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంటాయి. దానిమ్మ, క్యారెట్, ఆకు కూరలు నరాలను ఉత్తేజితం చేస్తాయి. పైనాపిల్, పుదీనా, నిమ్మకాయలు అజీర్తిని నివారిస్తాయి.దానిమ్మ, ద్రాక్ష, బీట్‌రూట్‌లు జ్ఞాపకశక్తిని పెంచితే, అరటిపండు, పియర్, స్ట్రాబెర్రీలు ఒత్తిడిని అధిగమించేందుకు సహాయపడతాయి.

## వీలైతే నాలుగు మాటలూ.. కుదిరితే కప్పు కాఫీ..!



'అమ్మా, కాఫీ...' బెడ్ మీద నుంచే ఓ పొలికేక...'హాయ్ అనూ... ప్లీజ్, నాతో ఓ కాఫీ'...'తలనొప్పిగా ఉంది గురూ. స్ట్రాంగ్ కాఫీ పడాల్సిందే'...ఇలా లేచింది మొదలు మళ్లీ నిద్రపోయేవరకూ కాఫీకోసం కలవరించేవాళ్లు కోకొల్లలు. మధురమైన దాని రుచీ ఆ పరిమళమూ అలాంటివి మరి. ఈ నెల 29న అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా మనం కూడా పొగలు కక్కే ఫిల్టర్ కాఫీని చప్పరిస్తూ ఆ కబుర్లు చెప్పుకుందాం...

అనుదినమ్మునూ కాఫీయే అసలు కిక్కు...

కొద్దిగానైనా పడకున్నా పెద్ద చిక్కు...' అంటూ కాఫీకి జేజేలు పలుకుతూ దండకాలూ పాటలూ పద్యాలూ రాసే కవివర్యులు మనదగ్గరే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఎందరెందరో. మధురమైన దాని పరిమళం గాల్లో అలా తేలి వస్తే చాలు... మనసు ఉప్పొంగిపోయే కాఫీప్రియులకు కొదవేముంది? అందుకే నాటి కాఫీ క్లబ్‌ల నుంచి నేటి కెఫెల వరకూ ఆదరణ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. 'వీలైతే నాలుగుమాటలూ కుదిరితే కప్పు కాఫీ' అంటూ నేటి యువతకి కెఫెలు కాలక్షేప వేదికలైతే కావచ్చేమోగానీ ఒకప్పుడు భావుకులకైనా విప్లవవాదులకయినా కాఫీ హౌస్‌లే చర్చావేదికలు. నురుగుతో పొంగే కాఫీ పడితేనే విప్లవ కవితైనా భావుకతైనా గోదారిలా ఉప్పొంగేదన్నమాట. కవిశ్రేష్ఠులనేముందీ... పొద్దుపొద్దున్నే ఇంత చద్ది తిని పనులకు పోయే పల్లె జనం సైతం వేడి కాఫీ గొంతు దిగందే పడక దిగనంతగా దానికి దాసానుదాసులైపోయారు. ఆ కాఫీగింజల్లో ఏం మహాత్యం ఉందో తెలీదుగానీ, ఒకసారి అలవాటుపడ్డవాళ్లు మానే యడం కుదరదంటే కుదరదు. అదిచ్చే ఆ కిక్కూ ఆ ఉత్తేజమూ అలాంటివి మరి. ఓ చుక్క గొంతులోకి ఇలా దిగిందో లేదో మెదడు పాదరసంలా పనిచేస్తుంది. డోపమైన్ విడుదలై ఆనందం వెల్లువెత్తుతుంది. అసలు కాఫీ ప్రపంచానికి పరిచయమైందే అలా...



వేల సంవత్సరాల క్రితం ఇథియోపియాలోని ఓ మేకలకాపరి, ఎర్రని బెర్రీలు తిని ఉత్సాహంగా గంతులేస్తోన్న మేకల్ని చూసి, వాటి ఆనందానికి కారణమైన కాఫీ మొక్కను గుర్తించాడట. అలా వెలుగులోకి వచ్చిన కాఫీని ఎస్‌ప్రెసో, కెపచీనొ, కెఫె లాటె, ఐస్‌డ్ కాఫీ... ఇలా భిన్న రుచుల్లో ఆనందంగా చప్పరించేయడం ప్రారంభించారు. డికాక్షన్ తీసే విధానం, దాని పాళ్లూ బట్టి కాఫీ రుచులు పలు రకాలన్నమాట. మెషీన్ కాఫీలన్నీ ఎస్‌ప్రెసో కాఫీ అనుకుంటారు. కానీ, అత్యధిక పీడనం, ఉష్ణోగ్రతల దగ్గర మరిగించిన నీటిని కేవలం 18 నుంచి 25 సెకన్లలో కలిపే మెషీన్ నుంచి తీసి నురుగుతో అందించే చిక్కని డికాక్షనే ఎస్‌ప్రెసో కాఫీ. ఇందులో పాలు కలపరు. ఎస్‌ప్రెసో కాఫీలో రుచికి తగ్గట్టుగా వేడినీళ్లు కలుపుకునేవే అమెరికానొ, బ్లాక్‌కాఫీలు. కప్పులో సగం ఎస్‌ప్రెసో కాఫీ పోసి దానిమీద ఆవిరితో కూడిన నురుగుపాలు పోసేదే కెపచీనొ. కెపచీనోలోనే మరిన్ని పాలు పోస్తే అది కెఫె లాటె(లాటె అంటే ఇటలీలో పాలు అని అర్థం). నాలుగు వంతుల ఎస్‌ప్రెసోకి ఒక శాతం పాలు పోస్తే అది కెఫె మకియాటో. ఎస్‌ప్రెసోలో చల్లని పాలు కలిపి చేసేది లాటె ఫ్రెడొ. ఇందులో ఐస్ వేసి షేక్ చేస్తారు. ఒకవంతు ఎస్‌ప్రెసో మరోవంతు చాకొలెట్ సిరప్, రెండుమూడు వంతులు నురుగుపాలు పోసి చేసేదే మోకా కాఫీ. ఇంకా కాక్‌టెయిల్ లాంటి ఎస్‌ప్రెసో గ్రనీటా, చల్లని ఫ్రాపె, ఫ్రాపెచీనొ... ఇలా చాలా రకాలే ఉన్నాయి. ఇన్‌స్టెంట్ కాఫీలూ వచ్చాయి. పాలూ కాఫీ డికాక్షన్‌తోబాటు రకరకాల సుగంధద్రవ్యాలను కలిపి చేసుకునే ఫ్లేవర్డ్ కాఫీలూ ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, భారతీయ ఫిల్టర్ కాఫీ ఒకెత్తు. అందుకే 'స్టీలు ఫిల్టర్ల పళ్లెంబులోనున్న రంధ్రాలలో నుండి నీ సారమంత సుతారంగ జారంగ నోరూరు చూడంగ నాసామిరంగ నిజంగానే చచ్చేవిధంగా' అనేశాడో కాఫీ ప్రియకవి. జై జై కాఫీ..!

**కాఫీ కాలక్షేపం!**

కాఫీ తయారీ అనేది ఇథియోపియా సంస్కృతిలో ఓ భాగం. ప్రతిరోజూ తాజా కాఫీగింజల్ని కడిగి వేయించి పొడి చేసి దాన్నుంచి కాఫీ తయారుచేసి కప్పులో పోయడం వరకూ ఓ వేడుకలా చేస్తారు. ఇదంతా చిన్నవయసు నుంచే అమ్మాయిలకు తల్లులు నేర్పిస్తుంటారు. పైగా కాఫీలో పంచదార, ఉప్పుతోపాటు వెన్న కూడా వేసి అందిస్తారు. నిజానికి కాఫీగింజల్ని వేయించేటప్పుడే కాస్త ఉప్పు జోడిస్తే చేదు ఉండదట. పైగా రుచిగానూ ఉంటుందంటారు కాఫీరుచుల నిపుణులు.

- టర్కీ, గ్రీసు దేశాల్లో అతిథులను కాఫీతోనే స్వాగతిస్తారు. అమెరికన్లయితే 65 శాతంమంది బ్రేక్‌ఫాస్ట్‌తోబాటు కాఫీ తాగుతారు.
- ప్రపంచవ్యాప్తంగా రోజుకి 50వేల కోట్ల కప్పుల కాఫీని సేవిస్తున్నారు.
- నిత్యావసర వస్తువుల్లో నూనె తరవాత అత్యధికంగా అమ్ముడుపోయేదీ కాఫీ గింజలే.
- కెఫీన్ ఎక్కువగా కావాలనుకునేవాళ్లు తక్కువగా వేయించిన గింజల్ని కొనుక్కుని పొడిచేసుకోవాలి. బాగా వేయిస్తే కెఫీన్ శాతం తగ్గుతుంది.
- సుమారు వంద కప్పుల కాఫీ తాగితే అది విషంగా పరిణమిస్తుంది.
- ఇది నరాలమీద ప్రభావం చూపిస్తుందన్న కారణంతో 15వ శతాబ్దంలో ముస్లిం పాలకులు కాఫీమీద నిషేధం విధించారట.

**ఖరీదైన కాఫీ!**

ప్రపంచంలోకెల్లా ఖరీదైన కాఫీలు చాలానే ఉన్నాయి. అవి పెరిగే ప్రాంతం, గింజల రుచిని బట్టి వాటి ధర కిలో లక్ష రూపాయల వరకూ పలుకుతుంటుంది. అయితే పునుగు పిల్లులకూ ఏనుగులకూ కావాలని గింజల్ని తినిపించి అవి విసర్జించిన గింజల్ని కడిగి ఎండలోపెట్టి తయారుచేసే కాఫీ ఓ కప్పు తాగాలన్నా వేల రూపాయలు చెల్లించాల్సిందే. సుమత్రాలోని పునుగు పిల్లులు తిని విసర్జించిన బెర్రీల నుంచి తయారుచేసే కొపి లూవాక్ కాఫీ ఖరీదు కప్పు ఆరు వేల రూపాయలు. ఇక ఏనుగుల తిని విసర్జించిన బెర్రీలతో తయారుచేసే బ్లాక్ ఐవరీ కాఫీ తాగాలంటే కప్పుకి మూడు వేల రూపాయలు పైనే బిల్లు కట్టాలి.

ఆరోగ్యం కోసం...

ఓ కప్పు కాఫీలో రోజువారీ అవసరమయ్యే రిబోఫ్లేవిన్‌లో 11 శాతం, పాంటోథీనిక్ ఆమ్లం 6 శాతం, మాంగనీస్ 3 శాతం, పొటాషియం 3 శాతం, నియాసిన్, మెగ్నీషియం 2 శాతం దొరుకుతాయి.

- కెఫీన్ నరాలను ప్రేరేపించడం ద్వారా శక్తినీ ఉత్తేజాన్నీ ఉల్లాసాన్నీ కలిగిస్తుంది.కాఫీలో అత్యధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్ల కారణంగా పార్కిన్‌సన్స్, అల్జీమర్స్, డిమెన్షియా, హృద్రోగాలు వచ్చే అవకాశం తక్కువ. డిప్రెషన్‌నీ తగ్గిస్తుంది. ఫలితంగా ఆత్మహత్యల శాతమూ తగ్గుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అయితే కాఫీ అలవాటున్నవాళ్లలో చాలామంది ఆల్కహాల్, సిగరెట్లూ, మాంసాహారం కూడా ఎక్కువగా తీసుకుంటారు. వాటి కారణంగానే ఆరోగ్యం ఎక్కువగా దెబ్బతింటుంది. రోజుకో కప్పు కాఫీ తాగే అలవాటుంటే కాలేయానికి సంబంధించిన సిరోసిస్ అనే వ్యాధి వచ్చే అవకాశం తక్కువట. అలాగే కాలేయ, చర్మసంబంధ క్యాన్సర్లూ రావట.
- జీవక్రియా వేగాన్ని కెఫీన్ 3 నుంచి 11 శాతం పెంచుతుంది.

## వయసుకు తగ్గ ఆభరణాలు!



వేడుకకు తగ్గట్టు, వయసుకు నప్పేటట్టు అలంకరించుకుంటేనే అందం! కాబట్టి ఏ వేడుకకు, ఎలాంటి అలంకరణ అవసరమో, ఏ వయసుకు ఎలాంటి ఆభరణాలు బాగుంటాయో తెలుసుకుంటే సగం సమస్య తీరినట్టే.

**చిన్నారులు:** 10 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలకు పట్టు లంగాలే అందం! ఈ డ్రస్సుకు మ్యాచ్ అయ్యేలా మెడకు దగ్గరగా కంఠి రకం నెక్లెస్ పెట్టాలి. నెక్లెస్ బదులుగా పొడవాటి హారం కూడా వేసుకోవచ్చు. నడుముకు వడ్డాణం పూర్తి అలంకరణకే వన్నె తెస్తుంది.

యువతులు: 15 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్కులు పేస్టెల్స్, లాంగ్ ఫ్రాక్స్ వేస్తారు కాబట్టి లాంగ్ ఇయర్ రింగ్స్, ముత్యాల చోకర్ ధరించాలి. చోకర్‌లో అన్‌కట్ డైమండ్ పెండెంట్ ఉండేలా చూసుకోవాలి.

**నడి వయస్కులు:** 30 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులకు బెనారస్ చీరలు నప్పుతాయి. పగలైనా, రాత్రైనా ఏ వేళలో జరిగే వేడుక అయినా వీరికి ఈ దుస్తులు అందంగా ఉంటాయి. హెవీ జుంకాలు, పోల్కీ, కుందన్ లేదా డైమండ్‌లో హెవీ నెక్లెసలు నప్పుతాయి. సాదా బంగారంలో అరుదైన డిజైన్లు కలిగి ఉండే నగలు ఎంచుకోవాలి.

**40 ఏళ్ల మహిళలు:** 40 ఏళ్ల వయసు స్త్రీలకు ఎలాంటి చీరలైనా నప్పుతాయి. పగటి వేళ వేడుకలకు పట్టు చీరలు కట్టుకోవచ్చు. చీరకు మ్యాచింగ్‌గా పూర్తి బంగారం లేదా గోల్డ్‌లో అన్‌కట్ డైమండ్ నగలు ధరించాలి. ఇది పగటివేళ వేడుకలకు తగిన అలంకరణ. ఇక రాత్రివేళ లేత రంగు జార్జెట్, షిఫాన్ చీరలే బాగుంటాయి. కాబట్టి ముత్యాలు, డైమండ్స్ బాగుంటాయి. చెవులకు పెద్ద స్టడ్స్ పెట్టుకోవాలి. అలాగే నగల అలంకరణ సింపుల్‌గా ఉండాలి. పుట్టిన రోజులు, రిసెప్షన్లు, సంగీత్ మొదలైన వేడుకలకు ఇదే తాజా జ్యువెలరీ ట్రెండ్!

**పెద్దలు:** 50 ఏళ్లు పైబడిన పెద్దలకు పట్టు చీరలే నప్పుతాయి. మెడలో నాన్‌తాడు, డైమండ్ నెక్లెస్ లేదా నక్షి నెక్లెస్ కూడా వేసుకోవచ్చు. జడ బిళ్లల ఫ్యాషన్ కూడా నడుస్తోంది.

## పసుపుతో మెరిసిపోండి



చర్మం నిగారింపుతో మెరిసిపోవాలంటే పసుపు తరువాతే ఏదైనా. అంత బాగా పనిచేస్తుంది పసుపు. వర్షాకాలంలో డల్‌గా మారిపోయిన చర్మం మీద పసుపుతో వేసుకునే ఫేస్‌ప్యాక్ ప్రభావంతంగా పని చేస్తుంది. అదెలా గంటే...

కల్తీలేని పసుపు - ఒకటీస్పూన్, శెనగపిండి - నాలుగు టేబుల్ స్పూన్లు, పాలు లేదా నీళ్లు - సరిపడా తీసుకోవాలి.

పసుపు, శెనగపిండిని ఒక గిన్నెలోకి తీసుకుని అందులో పాలు లేదా నీళ్లు పోసి కలపాలి.

ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు పూసుకుని ఇరవై నిమిషాల తరువాత నీళ్లతో కడిగేయాలి.

ఈ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవాలి. దీనివల్ల చర్మం మృదువుగా అవుతుంది. చర్మం శుభ్రపడుతుంది. దాంతో చర్మం మెరిసిపోతుంది.

## ఆర్గంజా అదరహో...



రాజసంగా, హుందాగా కనిపించాలంటే ఆర్గంజా డ్రస్ ఎంచుకోవాలి. తేలికగా, పలుచగా, స్టైలిషగా ఉండే ఆర్గంజా డ్రస్‌లు అన్ని వేడుకులకూ నప్పుతాయి. ఈ మెటీరియల్‌తో తయారయ్యే చుడీదార్‌లు ఇవే!

**ఆర్గంజా అదరహో...**

రాజసంగా, హుందాగా కనిపించాలంటే ఆర్గంజా డ్రస్ ఎంచుకోవాలి. తేలికగా, పలుచగా, స్టైలిషగా ఉండే ఆర్గంజా డ్రస్‌లు అన్ని వేడుకులకూ నప్పుతాయి. ఈ మెటీరియల్‌తో తయారయ్యే చుడీదార్‌లు ఇవే!

బుట్టబొమ్మలా కనిపించాలనుకుంటే వాల్యూమ్ పెంచే మెటీరియల్ ఎంచుకోవాలి. అలాంటి వాటిలో చెప్పుకోదగినది ఆర్గంజా. నైలాన్, పాలియెస్టర్ లాంటి సింథటిక్ ఫైబర్లతో తయారవుతున్న ఆర్గంజా, వన్నె తగ్గకుండా ఎక్కువ కాలం మన్నుతుంది. రకరకాల డిజైన్లలో రూపొందే ఆర్గంజాను వేర్వేరు మోడల్ దుస్తుల తయారీ కోసం ఉపయోగిస్తూ ఉంటారు. వాటిలో ప్రత్యేకించి చుడీదార్‌ల కోసం ఫ్లవర్ డిజైన్లను ఎంచుకుంటూ ఉంటారు. లేత గులాబీ, నీలం, పసుపు... ఇలా ముదురు రంగులకు బదులుగా హాయిగొలిపే లేత రంగుల ఫ్లవర్ డిజైన్లు తాజా ఫ్యాషన్.

**వినూత్నమైన వెరైటీల్లో...**

ఆర్గంజా సహజసిద్ధ మెరుపును కలిగి ఉంటుంది. కాబట్టి ఈ దుస్తులను ఈవినింగ్ పార్టీ వేర్‌గా ఎంచుకోవచ్చు. ఆర్గంజా డ్రస్ వెడ్డింగ్స్‌కు కూడా సూటవుతుంది. ఈ మెటీరియల్‌లో రకాలు కూడా ఉంటాయి. మిర్రర్, శాటిన్, క్రష్డ్, షాట్, ఎంబ్రాయిడర్డ్ ఆర్గంజాలలో డిజైన్ చేసే దుస్తులను బట్టి అందుకు నప్పే మెటీరియల్‌ను ఎంచుకోవాలి. సిల్క్, శాటిన్‌లతో కలిపి ఆర్గంజాను డిజైన్ చేసుకోవచ్చు.

**శాటిన్‌తో జోడీ కట్టి...**

ఆర్గంజాకు వెలుగును ప్రతిఫలించే స్వభావం ఉంటుంది. కాబట్టి లాంగ్ గౌన్స్, చున్నీ కలిగి ఉండే చుడీదార్స్ కుట్టించుకోవచ్చు. మరింత హుందాగా కనిపించడం కోసం శాటిన్ లైనింగ్ సెలెక్ట్ చేసుకోవాలి. హైహీల్స్, మెటల్ జ్యువెలరీలు ఈ రకం దుస్తులకు మ్యాచ్ అవుతాయి.

## శ్వాసకోశాల స్వస్థతకు...



శరీరంలోని అణువణువుకూ ప్రాణవాయువును చేరవేసేవి శ్వాసకోశాలే. అయితే తరుచూ వ్యాధిగ్రస్తమయ్యేవి కూడా శ్వాసకోశాలే. నిజానికి శ్వాసకోశ సమస్యలు ఏ వయసు వారినీ వదిలిపెట్టవు. కాకపోతే, స్వాభావికంగా పసిపిల్లలు కఫావస్థలో ఉంటారు కాబట్టి వాళ్లకు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటివి ఎక్కువగా వస్తూ ఉంటాయి. దాదాపు వృద్ధుల్లో కూడా కఫ ప్రవత్తి ఉంటుంది కాబట్టి శ్వాసకోశ వ్యాధులు వృద్ధుల్ని కూడా బాగా వేధిస్తూ ఉంటాయి. అయితే ఈ కింది జాగ్రత్తలు పాటించడం ద్వారా శ్వాసకోశ సమస్యల్ని చాలా వరకు అధిగమించవచ్చు.

రోజూ 5 తులసి ఆకులు, కరక్కాయ బెరడు తీసుకుని కిళ్లీలా చుట్టి బుగ్గన పెట్టుకుని ఆ రసాన్ని మింగుతూ ఉంటే గొంతులోని కఫం తగ్గిపోయి శ్వాసకోశ సమస్యలు సమసిపోతాయి.

రెండు చిటికెల పసుపు, రెండు చిటికెల సైంధవ లవణం, రెండు చిటికెల త్రికటు చూర్ణం ఈ మూడింటి మిశ్రమాన్ని నోట్లో వేసుకుని, కాఫీగానీ, టీ గానీ, తాగితే జలుబు, అలర్జీ వల్ల వచ్చే ఆయాసం తగ్గుతాయి.

ఆయాసం మరీ ఎక్కువగా ఉన్నప్పుడు 50 గ్రాముల వామును మూకుడులో వేయించి సన్నని గుడ్డలో మూట గట్టి వీపు పైన కాపడం పెడితే కఫం కరిగిపోయి ఆయాసం తగ్గుతుంది. ఆవాల పిండిని నీళ్లలో కలిపి గుడ్డకు పట్టించి ఛాతీపై వేస్తే, దగ్గు, ఆయాసం తగ్గుతాయి.

చిటికెడు శొంఠి చూర్ణం తీసుకుని ఒక పావు గ్లాసు నీళ్లలో వేసి మరగించి ఆ కషాయాన్ని తాగుతుంటే దగ్గు ఆయాసం తగ్గుతాయి. ఒక పావు గ్లాసు వేడిపాలల్లో మూడు మిరియపు గింజల పొడి, కొంచెం బెల్లం వేసి తీసుకుంటే దగ్గు జలుబు తగ్గుతాయి.

# భారీ నష్టాల్లో దేశీయ సూచీలు.. 81 వేల దిగువకు సెన్సెక్స్..




**న్యూఢిల్లీ-నవభూమి:** సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి విడుదలవుతున్న ఫలితాలు అంత ఆశాజనకంగా లేకపోవడం, విదేశీ మదుపర్లు నిధుల ఉపసంహరణ కొనసాగిస్తుండడంతో దేశీయ సూచీలు నష్టాల నుంచి తేరుకోలేకపోతున్నాయి. గురువారం భారీగా నష్టపోయిన దేశీయ సూచీలు శుక్రవారం కూడా అదే బాటలో నడుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు కోలుకోలేకపోతున్నాయి. అమెరికా మార్కెట్లు గురువారం మిశ్రమంగా ముగిశాయి. ఈ రోజు ఆసియా సూచీలు లాభాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అయితే దేశీయ సూచీలు మాత్రం నష్టాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి గురువారం ముగింపు (81, 006)తో పోల్చుకుంటే దాదాపు 250 పాయింట్ల నష్టంతో 80, 749 వద్ద శుక్రవారం ప్రారంభమైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింతగా నష్టాల్లోకి జారుకుంది. ఓ దశలో 600 పాయింట్లు నష్టపోయి 80, 409 వద్ద కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత కొద్దిగా కోలుకుంది. సెన్సెక్స్ ప్రస్తుతం ఉదయం 10:20 గంటలకు 330 పాయింట్ల నష్టంతో 80, 676 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. దాదాపు 85 పాయింట్లకు పైగా నష్టంతో రోజును ప్రారంభించింది. ప్రస్తుతం 93.65 పాయింట్ల నష్టంతో 24, 666 వద్ద కొనసాగుతోంది.




# ఫుడ్ వోచర్స్‌తో ఇంటి సామాన్లు కొనుగోలు.. ఉద్యోగులపై మెటా ఫైర్




**న్యూఢిల్లీ-నవభూమి:** ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా పలువురు ఉద్యోగులపై సీరియస్ అయ్యింది. ఫుడ్ వోచర్స్ సిస్టమ్‌ను మిస్‌యూజ్ చేసుకున్నట్లు గుర్తించిన సంస్థ.. సదరు ఉద్యోగులపై వేటు వేసింది. లాస్ ఏంజిల్స్ కార్యాలయంలో పనిచేస్తున్న సుమారు 24 మంది ఉద్యోగులు.. కంపెనీ ఫుడ్ వోచర్ సిస్టమ్‌ను దుర్వినియోగం చేశారు. ఈ మీల్ వోచర్స్‌తో ఉద్యోగులు టూత్‌పేస్ట్, లాండ్రీ డిటర్జెంట్, స్కాచ్ టేప్ వంటి గృహోపకరణాలతో పాటు ఆహారేతర (నాన్- ఫుడ్) వస్తువలైన వైన్ గ్లాస్ వంటివి కొనుగోలు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన సంస్థ.. దీనిపై అంతర్గత విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో ఉద్యోగులు ఆఫీసు వేళల్లో భోజనానికి సంబంధం లేని వస్తువులను కొనుగోలు చేసి ఫుడ్ క్రెడిట్‌లను దుర్వినియోగం చేసినట్లు తేలింది. ఉద్యోగుల తీరుపై సంస్థ సీరియస్ అయ్యింది. సదరు ఉద్యోగులను పిలిచి విచారించగా.. కిరాణా వస్తువులు, గృహోపకరణాల కోసం ఫుడ్ క్రెడిట్స్‌ను వినియోగించినట్లు అంగీకరించారు. దీంతో సంస్థ చర్యలకు ఉపక్రమించింది. దాదాపు 24 మంది ఉద్యోగులపై వేటు వేసింది.

**మెటాలో ఆగని ఉద్యోగాల కోతలు..**

మరోవైపు మెటాలో ఉద్యోగుల కోతలు ఆగడం లేదు. మరోసారి ఉద్యోగుల తొలగింపుకు సిద్ధమైంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, రియాలిటీ ల్యాబ్స్ కోసం పనిచేస్తున్న టీమ్‌లతో సహా మెటా వర్స్ అంతటా లే ఆఫ్స్‌ను ప్రకటించింది. అయితే, ఎంతమంది ఉద్యోగులను తొలగించారనే విషయాన్ని మెటా వెంటనే వెల్లడించలేదు. ఈ కోతల వల్ల కంపెనీలోని వివిధ టీమ్‌లు ప్రభావితమవుతాయని టెక్ క్రంచ్ నివేదిక తెలిపింది. దీర్ఘకాల వ్యూహాత్మక లక్ష్యాల కోసం కొన్ని టీముల్లో మార్పులు చేస్తున్నట్టు మెటా అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఉద్యోగాలు కోల్పోయిన వారికి వేరే అవకాశాలను చూపించడానికి తాము తీవ్రంగా శ్రమిస్తున్నట్టు చెప్పారు. తమను ఉద్యోగం నుంచి తొలగించారని పలువురు మెటా ఉద్యోగులు సామాజిక మాధ్యమాల్లో ప్రకటించారు. ఈ ఏడాది ప్రారంభంలో మెటా తన రియాల్టీ ల్యాబ్స్ విభాగం ఉద్యోగులను తొలగించింది.

# సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదుకు లిమిట్ ఉంది.. లేకుంటే ఐటీ నోటీసులు తప్పదు



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవల కాలంలో పరిస్థితులన్నీ పూర్తిగా మారిపోయాయి. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు, పాన్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ కంపల్సరీ అయిపోయింది. బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేయాలంటే.. ఖాతాదారుడికి ఖచ్చితంగా ఆధార్, పాన్ కార్డు ఉండి తీరాలి. అలా అయితేనే బ్యాంక్‌లో ఖాతా తెరుస్తున్నారు. అయితే బ్యాంక్ ఖాతాల్లో వివిధ రకాలు ఉన్నాయి. సేవింగ్ అకౌంట్, కరెంట్ అకౌంట్, శాలరీ అకౌంట్ తదితర రకాలున్నాయి. కానీ చాలా మంది సేవింగ్ అకౌంట్‌లనే ఓపెన్ చేస్తారు. అత్యధిక శాతం ఖాతాదారులు.. తాము సంపాదించిన నగదును ఈ ఖాతాల్లోనే పొదుపు చేస్తుంటారు. ఈ సేవింగ్ అకౌంట్లలో నగదు భద్రపరచడమే కాకుండా.. దీనిపై వడ్డీని సైతం పొందవచ్చు. మరికొన్ని సమయాల్లో.. ఇతరుల నగదును తమ ఖాతాల ద్వారా ఖాతాదారుడు లావాదేవీలు జరుపుతుంటాడు. అలాంటి వేళ సేవింగ్ అకౌంట్ పరిమితి దాటుతుంది. అసలు సేవింగ్ అకౌంట్‌లో లిమిట్ ఎంత ఉండాలి.

ఈ అకౌంట్‌లో ఎంత నగదు జమ చేసుకోవచ్చు. ఓ వేళ ఆ పరిమితి దాటితే ఖాతాదారుడికి ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా? అంటే.. ఎదురయ్యే అవకాశాలున్నాయి. సేవింగ్ అకౌంట్లలో దాచుకునే సొమ్ము పరిమితి దాటితే మాత్రం ఖాతాదారుడికి ఆదాయపు పన్ను శాఖ నుంచి నోటీసులు వచ్చే అవకాశముంది. మరి అలా కాకూడదంటే.. సేవింగ్ అకౌంట్‌లో ఎంత నగదు ఉంచవచ్చు. అంటే.. సేవింగ్ అకౌంట్‌లో ఎంత నగదు అయినా జమ చేసుకోవచ్చు. అందుకు పరిమితి లేదు. కానీ ఆదాయపు పన్ను శాఖ.. ఒక ఆర్థిక సంవత్సరంలో సేవింగ్స్ అకౌంట్‌లో నగదు జమ చేసేందుకు రూ.10 లక్షల వరకు పరిమితి విధించింది.

అంటే ఒక ఏడాదిలో బ్యాంక్ సేవింగ్ అకౌంట్‌లో రూ.10 లక్షల వరకు నగదు జమ చేయవచ్చు. ఆపై నగదు జమ చేస్తే మాత్రం ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చేస్తారు. దాంతో జమ అయిన నగదుపై పన్ను చెల్లించవలసి ఉంటుంది. సేవింగ్స్ అకౌంట్స్‌లో నగదు పరిమితికి మించి జమ అయితే మాత్రం బ్యాంకులు.. ఆదాయపు పన్ను శాఖ దృష్టికి తీసుకు వెళ్తాయి. దీంతో ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 285 బీఏ నిబంధనల ప్రకారం.. మీ ఖాతాలో జమ అయిన నగదు వివరాలను ఆ శాఖ పరిశీలిస్తుంది.

దీంతో సేవింగ్ అకౌంట్‌లో జమ అయిన నగదుకు.. రిటర్న్ ఫైల్ చేసే సమయంలో చూపిన వివరాలు కచ్చితంగా ఉండాలి. ఏ మాత్రం పొంతన లేకుంటే మాత్రం ఆదాయపు పన్ను శాఖ నోటీసులు జారీ చేస్తుంది. దీంతో ఖాతాదారుడు.. ఆ నగదుకు సంబంధించిన కచ్చితమైన వివరాలు ఆదాయపు పన్ను శాఖ వారికి సమర్పించాల్సి ఉంటుంది. ఆ క్రమంలో నగదు రాబడి అంశంలో ఏ మాత్రం తప్పు జరిగినట్లు భావించినా.. ఆదాయపు పన్ను శాఖ కఠిన నిర్ణయం తీసుకునే అవకాశముంటుంది. దీంతో జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలకు సైతం ఆ శాఖ ఉపక్రమించే అవకాశముంది. ఈ నేపథ్యంలోల సేవింగ్స్ అకౌంట్‌లో నగదు ఎంత ఉండాలనే విషయాన్ని ఖాతాదారుడు ముందే తెలుసుకుని మసులుకుంటే మంచిది.

# బిగ్ షాక్.. బంగారం తులానికి ఎంత పెరిగిందంటే..



**హైదరాబాద్- నవభూమి:** దీపావళి సందర్భంగా బంగారం కొనాలనుకునేవారికి ధరలు షాక్ ఇస్తున్నాయి. కొన్ని రోజులుగా తగ్గుతూ వస్తున్న పసిడి రేట్లు ప్రస్తుతం పెరుగుతూ కొనుగోలుదారులను ఆలోచనలో పడేస్తున్నాయి. దీపావళి ముందు వచ్చే ధంతేదాస్‌ను దేశ ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ఆ రోజు బంగారం కొనుగోలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని భావిస్తారు. అయితే ఈసారి మాత్రం పేద, మధ్య తరగతి ప్రజలకు ధరలు షాక్ ఇస్తున్నాయి. పరిస్థితి చూస్తుంటే దీపావళి నాటికి తులం పసిడి ధర రూ.80వేలకు చేరే అవకాశం కనిపిస్తోంది. అలాగే కొన్ని రోజులుగా కిలో వెండి ధర స్థిరంగా రోజుకు రూ.100చొప్పున పెరుగుతూ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. ప్రస్తుతం పసిడి ధరలు ఏ విధంగా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం..తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు..హైదరాబాద్‌లో రెండ్రోజులుగా బంగారం ధరలు పెరుగుతూ వచ్చాయి. అక్టోబర్ 18న 22 క్యారెట్ల పసిడి తులానికి రూ.200 పెరిగి రూ.71,600 ఉండగా.. 24 క్యారెట్ల ధర తులానికి రూ.220 పెరిగి రూ.78,110కి చేరింది. అలాగే విజయవాడ, విశాఖపట్నంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,610 కాగా.. 24 క్యారెట్ల ధర రూ.78,120లుగా ఉంది. అలాగే హైదరాబాద్‌లో వెండి కేజీ ధర రూ.1,03,100 ఉండగా.. విజయవాడ, విశాఖపట్నంలో రూ.1,02,800లుగా ఉంది. అయితే నిన్నటి రేట్లతో పోలిస్తే వెండి ధర తెలుగు రాష్ట్రాల్లో కిలోకు రూ.100మేర తగ్గింది.

ప్రధాన నగరాల్లో పసిడి ధరలు..

దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.71,760ఉండగా.. 24 క్యారెట్ల రేటు రూ.78,270లుగా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల పసిడి ధర రూ.71,610 కాగా.. 24 క్యారెట్ల ధర రూ.78,120లుగా ఉంది. అలాగే చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ.71,610 ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.78,120లుగా ఉంది.

# విప్రో బోనస్ బొనాంజా




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ ఐటీ సేవల కంపెనీ విప్రో బోనస్ షేర్ల బొనాంజా ప్రకటించింది. అమెరికన్ డిపాజిటరీ షేర్స్ (ఏడీఎస్) హోల్డర్లు సహా కంపెనీ వాటాదారులందరికీ 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు జారీ చేయాలని విప్రో బోర్డు సిఫారసు చేసింది. అంటే.. వాటాదారు కలిగిన ప్రతి ఒక్క విప్రో షేరుకు గాను మరో షేరు బోనస్‌గా లభించనుంది. ఈ సెప్టెంబరు 30 నాటికి ఉన్న ఉచిత రిజర్వ్ లేదా సెక్యూరిటీస్ ప్రీమియం అకౌంట్ లేదా కంపెనీ క్యాపిటల్ రిడంప్షన్ రిజర్వ్ అకౌంట్ నుంచి బోనస్ ఈక్విటీ షేర్లను జారీ చేయనున్నట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారం అందించింది. అయితే, ఈ ప్రతిపాదనను షేర్‌హోల్డర్లు ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తర్వాత కంపెనీ బోనస్ షేర్ల జారీకి అర్హులైన వాటాదారులను గుర్తించేందుకు రికార్డు తేదీని ప్రకటిస్తుంది.

ఈ డిసెంబరు 15 నాటికి కంపెనీ అర్హులైన వాటాదారులకు కేటాయించవచ్చని అంచనా. విప్రో బోనస్ షేర్ల జారీ రిటైల్ షేర్‌హోల్డర్లకు శుభవార్తే. ఈ సెప్టెంబరు 30 నాటికి విప్రో షేర్లు కలిగిన చిన్న షేర్‌హోల్డర్ల సంఖ్య దాదాపు 22 లక్షల స్థాయిలో ఉంది. విప్రో బోనస్ షేర్లు జారీ చేయడం 2019 తర్వాత ఇదే తొలిసారి. అలాగే, కంపెనీ చరిత్రలో ఇది 14వ సారి. గురువారం బీఎస్ఈలో కంపెనీ షేరు 0.65 శాతం నష్టపోయి రూ.528.80 వద్ద ముగిసింది. గతంలో ఆఫర్ లెటర్లు జారీ చేసిన ఫ్రెషర్లందరినీ ఈ ఏడాది చివరినాటికల్లా ఉద్యోగంలో చేర్చుకుంటామని విప్రో చీఫ్ హెచ్‌ఆర్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ స్పష్టం చేశారు. ఐటీ కంపెనీలు ఫ్రెషర్ల నియామకాలను 6 నెలల నుంచి 2 ఏళ్ల వరకు వాయిదా వేస్తూ వస్తున్నాయంటూ ఈ మధ్య వార్తలు వచ్చిన నేపథ్యంలో గోవిల్ వివరణ ఇచ్చారు. "ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1) నుంచి ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకుంటున్నాం. క్యూ1, క్యూ2లో 2,500-3,000 మంది చొప్పున కంపెనీలో చేర్చుకోవడం జరిగిందని" గోవిల్ అన్నారు. కాగా, సెప్టెంబరు 30 నాటికి కంపెనీలో మొత్తం 2,33,889 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో విప్రో లాభం వార్షిక ప్రాతిపదికన 21.2 శాతం వృద్ధి చెంది రూ.3,208.8 కోట్లకు చేరుకుంది. ఆదాయం మాత్రం 0.95 శాతం తగ్గి రూ.22,301.6 కోట్లకు పరిమితమైంది. అయితే, డిసెంబరుతో ముగియనున్న త్రైమాసికానికి స్థిర కరెన్సీ ఆదాయ వృద్ధి అంచనాను మైనస్ 1-ప్లస్ 1 శాతం స్థాయి నుంచి మైనస్ 2 నుంచి సున్నా శాతానికి తగ్గించింది.

# రాష్ట్ర హోదా కోరుతూ జమ్మూకశ్మీర్ మంత్రిమండలి తీర్మానం



**న్యూఢిల్లీ-నవభూమి:** జమ్ముకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదాను ఇవ్వాలని కోరుతూ ఆ రాష్ట్ర మంత్రి మండలి గురువారం తీర్మానం చేసింది. కేంద్ర పాలిత ప్రాంత సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం చేసిన మరుసటి రోజే మంత్రి మండలి తీర్మానం చేసింది. ఒమర్ అబ్దుల్లా నాయకత్వంలో గురువారం క్యాబినెట్ భేటీ జరిగింది. కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై గురువారం రాత్రి వరకు ఆ సర్కారు ఎటువంటి వివరాలను వెల్లడించారు. శ్రీనగర్‌లోని సచివాయంలో ఆ మీటింగ్ జరిగింది. తీర్మానాన్ని ఏకపక్షంగా ఆమోదించారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ఇవ్వాలంటూ కేంద్రాన్ని కోరారు. ఈ విషయంపై ప్రధాని మోదీతో చర్చించేందుకు సీఎం ఒమర్ అబ్దుల్లా ఢిల్లీ వెళ్లనున్నారు. ఆ పర్యటనలో తీర్మానాన్ని ఆయన ప్రధానికి అందజేయనున్నారు.

# ఇన్ఫీ లాభం రూ.6,506 కోట్లు




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25).. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) ఇన్ఫోసిస్ రూ.6,506 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే లాభం 4.7 శాతం అధికమిది. ఈ ఆర్థిక సంవత్సరంలో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోల్చినా లాభం 2.2 శాతం పెరిగింది. కాగా, ఈ క్యూ2లో ఇన్ఫీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 4.2 శాతం పెరిగి రూ.40,986 కోట్లుగా నమోదైంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి స్థిర కరెన్సీ ఆ?ధారిత ఆదాయ వృద్ధి అంచనాను 3.75-4.50 శాతానికి పెంచింది. గత త్రైమాసిక ఫలితాల విడుదల సందర్భంగా ప్రకటించిన 3-4 శాతం ఆదాయ వృద్ధి అంచనా కంటే ఎక్కువ ఇది. కంపెనీకి కీలక ఆదాయ విభాగమైన ఆర్థిక సేవల రంగంలో క్లయింట్ల డీల్స్ పునరుద్ధరణ ఇందుకు దోహదపడనుందని కంపెనీ అభిప్రాయపడింది. అంతేకాదు, కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను పెంచడం ఇది రెండోసారి. జూలైలోనూ అంచనాను 1-3 శాతం నుంచి 3-4 శాతానికి పెంచింది. వరుసగా ఆరు త్రైమాసికాలుగా తగ్గుతూ వస్తున్న ఇన్ఫోసిస్ ఉద్యోగుల సంఖ్యకు ఎట్టకేలకు అడ్డుకట్ట పడింది. సెప్టెంబరు త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 2,456 పెరిగి మొత్తం 3,17,788కి చేరుకుంది. అయితే, గత త్రైమాసికంలో ఉద్యోగుల వలసల రేటు మాత్రం 12.9 శాతానికి పెరిగింది. ఈ క్యూ1లో వలసల రేటు 12.7 శాతం గా నమోదైంది.

240 కోట్ల డాలర్ల బడా డీల్స్

గత త్రైమాసికంలో కంపెనీ 240 కోట్ల డాలర్ల విలువైన బడా డీల్స్‌ను దక్కించుకుంది. బడా డీల్స్ పుంజుకున్న నేపథ్యంలోనే కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాలను మరింత పెంచింది.

డివిడెండ్ రికార్డు తేదీ అక్టోబరు 29

ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.21 మధ్యంతర డివిడెండ్ చెల్లించనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. డివిడెండ్‌కు అర్హులైన షేర్‌హోల్డర్లను గుర్తించేందుకు రికార్డు తేదీని అక్టోబరు 29గా నిర్ణయించింది. వచ్చే నెల 8న డివిడెండ్ చెల్లించనున్నట్లు సంస్థ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు మొత్తం రూ.46 డివిడెండ్ చెల్లించింది. ఈ క్యూ2లో త్రైమాసిక ప్రాతిపదికన 3.1 శాతం స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధిని నమోదు చేయగలిగాం. ఆర్థిక సేవల రంగంలో డీల్స్ పునరుద్ధరణ ఇందుకు దోహదపడింది. అంతేకాదు, గత మూడు నెలల్లో 240 కోట్ల డాలర్ల బడా డీల్స్ దక్కించుకోగలగడం మార్కెట్లో మా ప్రత్యేక స్థానాన్ని ప్రతిబింబింపజేస్తుంది.

# జావా 42 ఎఫ్‌జే బైకు ప్రారంభ ధర రూ.1.99 లక్షలు



**హైదరాబాద్- నవభూమి:** ప్రీమియం మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ జావా యెజ్డీ మోటర్‌సైకిల్.. తాజాగా మరో మాడల్‌ను రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా స్పోర్ట్స్ బైకులను పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నూతన 350 జావా 42 ఎఫ్‌జేను అందుబాటులోకి తీసుకొచ్చింది. నాలుగు రకాల్లో లభించనున్న ఈ బైకు రూ.1.99 లక్షల నుంచి రూ.2.23 లక్షల మధ్యలో లభించనున్నది. ఈ సందర్భంగా జావా యెజ్డీ కో-ఫౌండర్ అనుపమ్ తరేజా మాట్లాడుతూ.. ప్రస్తుతం తెలంగాణలో 12 షోరూంలు ఉండగా, వచ్చే ఏడాదికాలంలో మరో 3 షోరూంలను కొత్తగూడెం, గద్వాల్, షాద్‌నగర్‌లలో ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 8 షోరూంలను నెలకొల్పబోతున్నట్లు ఆయన ప్రకటించారు.

# ఈపీఎఫ్‌వో సభ్యులకు శుభవార్త

**న్యూఢిల్లీ-నవభూమి:** ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) పథకం కింద ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో)లోని సభ్యులందరికీ గతంలో పెంచిన బీమా ప్రయోజనాలను పొడిగిస్తున్నట్టు గురువారం కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియా ప్రకటించారు. దీంతో ఉద్యోగ భవిష్య నిధి ఈపీఎఫ్‌వోలోని 6 కోట్లకుపైగా సభ్యులకు రూ.7 లక్షలదాకా జీవిత బీమా కవరేజీ రానున్నది. ఈ కవరేజీ పొడిగింపు ఈ ఏడాది ఏప్రిల్ 28 నుంచే వర్తిస్తుందని కూడా ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మంత్రి స్పష్టం చేశారు. ఈడీఎల్ఐ స్కీంను 1976లో ప్రారంభించారు. ఈపీఎఫ్‌వో సభ్యులు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూతనిచ్చేలా బీమా ప్రయోజనాలను ఇందులో కల్పించారు. అయితే 2021 ఏప్రిల్ 28న వచ్చే మూడేండ్లకుగాను ఈ పథకం కనీస బీమా కవరేజీని రూ.2.5 లక్షలకు, గరిష్ఠ బీమా కవరేజీని రూ.7 లక్షలకు పెంచారు. ఈ ఏడాది ఏప్రిల్ 27తో ఆ వ్యవధి పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి తాజా ప్రకటన వచ్చింది. దీంతో ఏప్రిల్ 28 తర్వాత మరణించిన ఈపీఎఫ్‌వో సభ్యులకూ ఇకపై అధిక బీమా ప్రయోజనం దక్కనున్నది. ఇదిలావుంటే కంపెనీలో వరుసగా 12 నెలల సర్వీస్ ఉన్నవారికి ఈ బీమా వర్తిస్తుందన్న నిబంధననూ సడలించారు. ఉద్యోగాలు మారినా బీమా ఉంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ బీమాకు సంబంధించి ఉద్యోగుల తరఫున కంపెనీలే చెల్లిస్తాయి.

# మణప్పురం ఫైనాన్స్‌కు భారీ షాక్.. 11 నెలల కనిష్టానికి షేర్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ గోల్డ్ లోన్ సంస్థ మణప్పురం ఫైనాన్స్(ఉర్లలో నేడు (అక్టోబర్ 18న) భారీ పతనం కనిపించింది. ఈ క్రమంలో ఒక దశలో %దీజు%లో ఈ షేరు 16.85 శాతం క్షీణించి రూ. 147.50 కనిష్ట స్థాయికి చేరుకుంది. గత 11 నెలల్లో ఈ స్టాక్ ఇంత తక్కువకు చేరుకోవడం ఇదే మొదటిసారి. అయితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మణప్పురం అనుబంధ సంస్థ అయిన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్‌కు రుణాలు ఇవ్వకుండా నిలిపివేయడం వల్ల మణప్పురం ఫైనాన్స్ షేర్లు భారీగా పడిపోయాయి.

రుణగ్రహీతల నుంచి అధిక వడ్డీ వసూలు చేయడంతో బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ ఈ చర్య తీసుకుంది. ఇప్పటికే ప్రాసెస్‌లో ఉన్న లావాదేవీలను పూర్తి చేసిన తర్వాత అక్టోబర్ 21 నుంచి ఈ కంపెనీపై పరిమితి అమల్లోకి వస్తుందని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్‌తో పాటు, ఆరోహన్ ఫైనాన్షియల్ సర్వీసెస్, %ఐవీ×% ఫైనాన్స్, ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ నవీ ఫిన్‌సర్వ్‌లపై కూడా %=దీ×% ఇదే విధమైన పరిమితులను విధించింది. ఈ కంపెనీలు ఇప్పటికే ఉన్న రుణాలకు సేవలను కొనసాగించుకోవచ్చు. కానీ కొత్త రుణాలపై మాత్రం పరిమితులు విధించారు. ఈ నేపథ్యంలో మరికొన్ని రోజుల్లో ఈ కంపెనీల వ్యాపార వృద్ధి, ఆదాయాలపై ప్రభావం చూపనుంది. మణప్పురం ఫైనాన్స్‌కు అనుబంధంగా ఉన్న ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులలో నాలుగింట ఒక వంతు వాటాను అందజేస్తుందని ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ఒక నోట్‌లో పేర్కొంది. ఆర్బీఐ నుంచి ఈ నివేదిక వచ్చిన తర్వాత మోర్గాన్ స్టాన్లీ ఈ స్టాక్ విలువను తగ్గించింది. ఈ నేపథ్యంలో షేర్ టార్గెట్ ధరను రూ.170కి తగ్గించింది. %వీఖీ×%లపై చర్యలు లాభాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని బ్రోకరేజ్ తెలిపింది. ఈ నేపథ్యంలో 25 కోసం కంపెనీ ఏకాభిప్రాయ ఆదాయ అంచనాలను 20 శాతం నుంచి 26-27 కోసం 30 శాతానికి తగ్గించింది. ఆదాయాల అంచనాలను తగ్గించినప్పటికీ వాల్యుయేషన్లు చౌకగా ఉన్నాయని బ్రోకరేజ్ సంస్థ చెబుతోంది. దీంతో ఈ స్టాక్‌పై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరగడానికి మరికొంత సమయం పట్టవచ్చని అంచనా వేసింది. వెయిటెడ్ యావరేజ్ లెండింగ్ రేట్ , నిధుల వ్యయంతో సహా కంపెనీ ధరల విధానాన్ని పరిశీలించిన తర్వాత ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ రుణ వ్యాపారాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు %=దీ×% తెలిపింది. అక్టోబర్ 17, 2024 నాటి ఆర్డర్‌లో అక్టోబర్ 21న వ్యాపారం ముగిసిన తర్వాత రుణ మంజూరు లేదా పంపిణీని నిలిపివేయాలని కంపెనీకి ముఖ్యమైన అనుబంధ సంస్థ అయిన ఆశీర్వాద్ మైక్రోఫైనాన్స్ లిమిటెడ్ ని ఆదేశించిందని మణప్పురం ఫైనాన్స్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది.



# ఎగసి పడ్డ అలలు..జనవాస ప్రాంతాల్లోకి వరద నీరు



**చెన్నై- నవభూమి:** ప్రపంచ ప్రసిద్ధి గాంచిన పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో రెండో రోజు సముద్రతీరంలో అలలు తీరం వైపు ఎగసిపడ్డాయి. సునామీ తర్వాత ఇక్కడి తీరంలో అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రనీటి మట్టం తగ్గటం, పెరగటం జరుగుతూ ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తీరం పొడవునా రాక్షస అలలు దూసుకువచ్చి జనవాస ప్రాంతాల్లోకి చొరబడ్డాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కూడా 15 అడుగుల ఎత్తున తీరం నుండి 50 అడుగుల వరకు అలలు దూసుకువచ్చాయి. దీంతో త్రివేణి సంగమం, సంగిలితురై ప్రాంతాల్లో సముద్రం వెనక్కి మళ్ళింది. తిరువళ్లువర్ విగ్రహం ప్రాంతం వద్ద కూడా అలలు ఎగసిపడ్డాయి. ఉదయం ఎనిమిది గంటల తర్వాత కూడా అలజడి తగ్గకపోవడంతో వివేకానంద స్మారక మండప ప్రాంతాని బోట్ సవారీని పూంపుహార్ సంస్థ రద్దు చేసింది. చిన్నముట్టం, వావత్తురై, కోవళం, కీళ్‌మనక్కుడి, మనక్కుడి వంటి తీర ప్రాంత గ్రామలలోనూ అలల తాకిడి అధికంగా కనిపించింది.



# మోదీ సర్కారు తీరుకు నిరసనగా.. నవంబర్ 26న దేశవ్యాప్త నిరసనలు: ఎస్‌కేఎం




**న్యూఢిల్లీ- నవభూమి:** కేంద్రంలో మోదీ సర్కార్ తీరును నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు, ర్యాలీలు చేపడుతున్నట్టు రైతు సంఘాల ఐక్య వేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) తెలిపింది. 'ఢిల్లీ మార్చ్' పేరుతో రైతులు చేపట్టిన నిరసనలకు నాలుగేండ్లు అయిన సందర్భంగా వచ్చే నెల 26న దేశంలోని 500 జిల్లాల్లో ఆందోళనలు చేపడుతున్నామని తాజాగా ప్రకటించింది.ఏఐకేఎస్ నాయకుడు హన్నన్ మొల్లా విలేకర్లతో మాట్లాడుతూ, 'రైతులకు ఇచ్చిన వాగ్దానాలను కేంద్రం నెరవేర్చలేదు. రైతులను మోసం చేసింది. దీంతో మేం దేశమంతా ఆందోళనకు సిద్ధమవుతున్నాం' అని అన్నారు. కేంద్రం ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఏడాది రైతులు తమ ఆందోళనల్ని మరింత ఉధృతం చేస్తారని క్రాంతికారి కిసాన్ యూనియన్ అధ్యక్షుడు దర్శన్‌పాల్ అన్నారు.

# సీఎం చుట్టూ బిగుస్తున్న ఉచ్చు.. ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు

**బెంగళూరు – నవభూమి:** మైసూర్ అర్బన్ డవలప్‌మెంట్ ఆథారిటీ కుంభకోణంలో కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. మైసూరులోని ముడా కార్యాలయంలో ఈడీ అధికారులు శు క్రవారంనాడు సోదాలు చేపట్టారు. హుడా భూముల కేటాయింపు వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు, పలువురు అధికారుల ప్రమేయంపై ఆరోపణల నేపథ్యంలో ఈడీ తనిఖీలు సంచలనం సృష్టిస్తున్నాయి. ముడా కమిషనర్ రఘునందన్ సహా పలువురు అధికారులను దర్యాప్తు బృందం కలిసినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.సెంట్రల్ పారామిలటరీ పోలీసుల భద్రతతో ఈడీ అధికారులు ముడా కార్యాలయంతో పాటు మైసూరులోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే మఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో కానీ, వారి సంబంధీకుల ఇళ్లలో కానీ సోదాలు జరపలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రెండ్రోజుల క్రితం ముడా అథారిటీ చైర్మన్ కె.మరిగౌడ తన ఉద్యోగానికి రాజీనామా చేయడం సంచలనమైంది. సిద్ధరామయ్యకు ఆయన సన్నిహితుడనే పేరుంది. అనారోగ్యం కారణంగానే మరిగౌడ రాజీనామా చేసినట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.ముడాకు చెందిన 14 స్థలాలను సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి కేటాయించడంపై ముఖ్యమంత్రి కొద్దికాలంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సీఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణకు గవర్నర్ అనుమతించడం సంచలనమైంది. దీనిపై సిద్ధరామయ్య హైకోర్టులో సవాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే లోకాయుక్త పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది పేర్లు చేర్చారు. ముడా స్కామ్ ఆరోపణలతో తన ప్లాట్లను సిద్ధరామయ్య భార్య తిరిగి ముడాకు అప్పగించారు. తనపై వచ్చిన ఆరోపణలను సిద్ధరామయ్య ఖండించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసులు బనాయించారని చెబుతున్నారు.


# సీఎం చుట్టూ బిగుస్తున్న ఉచ్చు.. ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు




**బెంగళూరు – నవభూమి:** మైసూర్ అర్బన్ డవలప్‌మెంట్ ఆథారిటీ కుంభకోణంలో కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. మైసూరులోని ముడా కార్యాలయంలో ఈడీ అధికారులు శు క్రవారంనాడు సోదాలు చేపట్టారు. హుడా భూముల కేటాయింపు వ్యవహారంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యులు, పలువురు అధికారుల ప్రమేయంపై ఆరోపణల నేపథ్యంలో ఈడీ తనిఖీలు సంచలనం సృష్టిస్తున్నాయి. ముడా కమిషనర్ రఘునందన్ సహా పలువురు అధికారులను దర్యాప్తు బృందం కలిసినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది.

సెంట్రల్ పారామిలటరీ పోలీసుల భద్రతతో ఈడీ అధికారులు ముడా కార్యాలయంతో పాటు మైసూరులోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే మఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లలో కానీ, వారి సంబంధీకుల ఇళ్లలో కానీ సోదాలు జరపలేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రెండ్రోజుల క్రితం ముడా అథారిటీ చైర్మన్ కె.మరిగౌడ తన ఉద్యోగానికి రాజీనామా చేయడం సంచలనమైంది. సిద్ధరామయ్యకు ఆయన సన్నిహితుడనే పేరుంది. అనారోగ్యం కారణంగానే మరిగౌడ రాజీనామా చేసినట్టు ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

కేసు పూర్వాపరాలు...ముడాకు చెందిన 14 స్థలాలను సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి కేటాయించడంపై ముఖ్యమంత్రి కొద్దికాలంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సీఎంపై వచ్చిన ఆరోపణలపై విచారణకు గవర్నర్ అనుమతించడం సంచలనమైంది. దీనిపై సిద్ధరామయ్య హైకోర్టులో సవాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ క్రమంలోనే లోకాయుక్త పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసులో సిద్ధరామయ్య, ఆయన భార్య పార్వతి, బావమరిది పేర్లు చేర్చారు. ముడా స్కామ్ ఆరోపణలతో తన ప్లాట్లను సిద్ధరామయ్య భార్య తిరిగి ముడాకు అప్పగించారు. తనపై వచ్చిన ఆరోపణలను సిద్ధరామయ్య ఖండించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే తనపై కేసులు బనాయించారని చెబుతున్నారు.

# ఈషా ఫౌండేషన్‌కు భారీ ఊరట.. ఆ కేసును కొట్టేసిన సుప్రీంకోర్టు



**బెంగళూరు – నవభూమి:**ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ కు భారీ ఊరట లభించింది. సద్గురుకు చెందిన ఈషా ఫౌండేషన్ పై నమోదైన కేసును సుప్రీంకోర్టు కొట్టేసింది. తన ఇద్దరు కూతుళ్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లను ఈషా యోగా సెంటర్ నుంచి బయటకు రానివ్వడం లేదంటూ ఓ వ్యక్తి ఇటీవలే హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇవాళ విచారణ జరిపింది.

విచారణ సందర్భంగా ఆ ఇద్దరు మహిళలు ఈషా కేంద్రంలో స్వచ్ఛందంగానే ఉంటున్నారని అత్యున్నత న్యాయస్థానానికి పోలీసులు తెలిపారు. ఈ మేరకు వివరాలు సమర్పించారు. పోలీసులు సమర్పించిన వివరాలను పరిశీలించిన న్యాయస్థానం.. ఈ కేసును కొట్టేస్తూ ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది.కోయంబత్తూరులోని తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్ కామరాజ్ ఆ కేసు ఫైల్ చేశారు. 42, 39 ఏళ్లు ఉన్న ఇద్దరు కూతుర్లను సద్గురు బ్రెయిన్‌వాష్ చేశారని, వాళ్లను ఈషా యోగా సెంటర్ నుంచి బయటకు రానివ్వడం లేదంటూ ఆరోపించారు. ఈ మేరకు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవలే ఈ కేసుపై మద్రాసు హైకోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణ సందర్భంగా ఇద్దరు మహిళలు కోర్టుకు హాజరయ్యారు. తమ ఇష్ట ప్రకారమే ఈషా ఫౌండేషన్‌లో ఉంటున్నట్లు చెప్పారు. తమను ఎవరూ బంధించలేదని స్పష్టం చేశారు.దీంతో ఈషా ఫౌండేషన్‌కు సంబంధించిన అన్ని కేసుల జాబితాను తయారు చేసి, నివేదికను సమర్పించాలని పోలీసులను కోర్టు ఆదేశించింది. ఫౌండేషన్‌పై అనేక క్రిమినల్ ఫిర్యాదులు ఉన్నాయని పేర్కొన్న మద్రాస్ హైకోర్టు.. ఈ కేసులో మరింత లోతుగా విచారణ చేపట్టాలని సూచించారు. సద్గురు తన కుమార్తెకు వివాహం జరిపించి సంపన్నమైన జీవితాన్ని ప్రసాదించారని, ఇతర స్త్రీలను సన్యాసం తీసుకునేలా ప్రోత్సహిస్తున్నాడని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ మేరకు హైకోర్టు ఈషా ఫౌండేషన్‌కు వ్యతిరేకంగా ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు దాదాపు 150 మంది పోలీసులు ఈషా ఫౌండేషన్‌లో తనిఖీలు చేశారు.ఇక ఈ వ్యవహారంపై ఈషా ఫౌండేషన్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. దీంతో ఈ కేసు మద్రాసు హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు బదిలీ అయ్యింది. దీనిపై ఇటీవలే విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. మహిళల వాంగ్మూలాన్ని బట్టి వారు స్వచ్ఛందంగా ఆశ్రమంలో ఉండటంపై ఎలాంటి సందేహాలకు తావులేదని పేర్కొంది. ఈ కేసులో తదుపరి చర్యలు తీసుకోకుండా స్టేటస్ రిపోర్టును అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు చేయాలని తమిళనాడు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇవాళ తీర్పు వెలువరించింది.

# ప్రాణాలతో ఉండాలంటే 5 కోట్లు ఇవ్వండి..



**న్యూఢిల్లీ- నవభూమి:**బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్‌కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. ప్రాణాలతో ఉండాలన్నా, బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ హెచ్చరించారు. ఈ మేరకు ముంబై ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు గురువారం రాత్రి మెసేజ్ చేశారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ నంబర్ ఎవరిది, మెసేజ్ ఎక్కడి నుంచి వచ్చిందని కనుక్కొనే పనిలో పడ్డారు. అసలు ఆ మెసేజ్‌లో ఏముందంటే..

'ఈ బెదిరింపులను తేలికగా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వానికి సమాప్తం పలకాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుంది.' అని దుండగులు బెదిరించారు. ఈ నేపథ్యంలో బాంద్రాలోని సల్మాన్ ఖాన్ ఇంటివద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే ఆయనకు పలుమార్లు బెదిరింపులు రావడంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. కాగా, సల్మాన్ ఖాన్ హత్యకు కుట్ర కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడిని పోలీసులు గురువారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హర్యానాలోని పానిపట్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**అసలేం జరిగిందటే..**

1998 కృష్ణ జింక కేసు నుంచి సల్మాన్ ఖాన్.. లారెన్స్ బిష్ణోయ్ గాంగ్ టార్గెట్ జాబితాలో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. ఈ గ్యాంగ్ నుంచి సల్మాన్ అనేక సార్లు హత్య బెదిరింపులు ఎదుర్కొన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద కాల్పుల ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. మోటారు బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సల్మాన్ ఇంటి ముందు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. ఇక ఈ కేసును దర్యాప్తు చేస్తున్న క్రమంలోనే జూన్‌లో మరోసారి సల్మాన్ హత్యకు కుట్ర జరిగింది. పన్వేల్ ఫామ్‌హౌస్ నుంచి ఇంటికి వెళ్తున్న మార్గంలో సల్మాన్‌పై దాడి చేయాలని ఈ గ్యాంగ్ ప్లాన్ చేసినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులోనే తాజాగా అరెస్ట్ జరిగింది.ఇక ఈ కేసు దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సల్మాన్ హత్యకు బిష్ణోయ్ గ్యాంగ్ పక్కా ప్లానింగ్‌తో వ్యవహరిస్తోందని పోలీసులు ఛార్జిషీట్‌లో ప్రస్తావించారు. పంజాబీ సింగర్ సిద్ధూ మూసేవాలా హత్య తరహాలోనే కారులో సల్మాన్‌ను హత్య చేయాలని నిర్ణయించినట్లు పోలీసులు గుర్తించారు. రూ.25 లక్షల ఒప్పందం ప్రకారం సల్మాన్‌ను హత్య చేయాలనుకున్నారని, ఆగస్ట్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు నెలల పాటు ఈ హత్య ప్రణాళికను రూపొందించారని పోలీసులు ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు.నటుడి హత్యకు మోడ్రన్ వెపన్స్ కొనుగోలుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నిందితుల ముఠా ఏకే-47, ఎం16, ఏకే-92 తుపాకులు, హై-కాలిబర్ ఆయుధాలను వంటి అధునాతన మారణాయుధాలను పొరుగు దేశం పాకిస్థాన్ నుంచి కొనుగోలు చేయాలని భావించారని పోలీసులు పేర్కొన్నారు. సల్మాన్ హత్య కుట్రలో భాగంగా సల్మాన్ ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలు, బాంద్రాలోని నివాసం సహా షూటింగ్ ప్రదేశాల్లో బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన సుమారు 70 మంది రెక్కీ నిర్వహిస్తూ.. నటుడి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు విచారణలో తేలింది.

# ఖలిస్థానీ ఉగ్రవాది హత్యకు కుట్రలో బిగ్ ట్విస్ట్.. భారత 'రా' అధికారిపై అమెరికా అభియోగాలు..



**న్యూఢిల్లీ- నవభూమి:**ఖలిస్థానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న అమెరికా భారత నిఘా విభాగం (రా) మాజీ అధికారి వికాస్ యాదవ్‌ను నిందితుడిగా పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తాను అమెరికా అరెస్ట్ చేసింది. ప్రస్తుతం అతడు అమెరికా జైల్లో ఉన్నారు. రా మాజీ అధికారిపై అమెరికా అభియోగాలు మోపడం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. ఖలిస్తానీ ఉగ్రవాది పన్నూ హత్య కుట్రకు వికాస్ యాదవ్ నేతృత్వం వహించినట్లు అమెరికా న్యాయశాఖ అభిమోగాల్లో వెల్లడించింది. న్యూయార్క్‌లోని న్యాయస్థానంలో ఈ కేసుకు సంబంధించి ఛార్జ్‌షీట్ దాఖలైంది. పన్నూ హత్యకు వికాస్ యాదవ్ కుట్ర చేశారని, కిరాయి వ్యక్తులను నియమించడం, పన్నూ హత్యకు ప్లాన్ చేసినట్లు అభియోగాలు మోపింది. ప్రస్తుతం వికాస్ యాదవ్ పరారీలో ఉన్నారని పేర్కొంది. భారత విదేశీ ఇంటిలెజెన్స్ విభాగం (రా) నిర్వహించే కేబినెట్ సెక్రటేరియట్‌లో వికాస్ యాదవ్ పనిచేశారు. పన్నూ హత్యకు కుట్రపై అమెరికాలోని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) తీవ్రంగా స్పందించింది. ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ స్పందిస్తూ.. అమెరికాలో నివాసం ఉంటూ.. రాజ్యాంగబద్ధంగా సంరక్షించిన హక్కులను పొందిన వారిపై ప్రతీకారం తీర్చుకోవడానికి హింసాత్మక చర్యలను లేదా ఇతర ప్రయత్నాలను ఎఫ్‌బీఐ సహించబోదన్నారు. తమ గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని గతేడాది మే మొదటి వారంలో అమెరికా ఆరోపించింది. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్యకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. పన్నూ హత్య పథకాన్ని అమలు చేయడానికి నిఖిల్ గుప్తాతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు.

నిఖిల్ గుప్తా అరెస్ట్..పన్నూ హత్యకు కుట్ర కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న నిఖిల్ గుప్తా భారత్‌కు వస్తుండగా 2023 నవంబరులో చెక్ రిపబ్లిక్ రాజధాని పరాగ్వే విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. అక్కడ జైలులో ఉన్న నిఖిల్‌ను అమెరికాకు అప్పగించారు. ఇదే కేసులో భారత ప్రభుత్వానికి సైతం అమెరికా కోర్టు సమన్లు జారీ చేసింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. దీనిపై విచారణకు స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని నియమించింది. ఈ క్రమంలోనే ఇటీవల భారత అధికారుల బృందం అమెరికా విదేశాంగ శాఖ, న్యాయశాఖ అధికారులతో సమావేశమైంది.

భారత్ క్లారిటీ..పన్నూ హత్యకు కుట్ర కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని భారత్ తమకు వెల్లడించినట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మాథ్యూ మిల్లర్ తెలిపారు. మరోవైపు భారత దర్యాప్తు కమిటీ పర్యటన ముగిసిన తర్వాతే వికాస్ యాదవ్‌పై అమెరికా అభియోగాలు నమోదు చేసింది. పన్నూను హత్య చేస్తే లక్ష డాలర్లు ఇస్తానని నిఖిల్ గుప్తాతో ఒప్పందం చేసుకున్నారని, అడ్వాన్సుగా 15వేల డాలర్లు చెల్లించారని అమెరికా ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ లావాదేవీలు న్యూయార్క్ సమీపంలో జరిగాయని అభియోగాల్లో తెలిపింది. ప్రస్తుతం వికాస్ యాదవ్ ఆచూకీ కోసం అమెరికా గాలిస్తోంది.

## మనీ లాండరింగ్ కేసులో


# సత్యేంద్ర జైన్‌కు బెయిల్



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ నేత, మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ )కు మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ కోర్టు శుక్రవారంనాడు బెయిల్ మంజూరు చేసింది. విచారణలో జాప్యం, ఎక్కువ కాలం నిర్బంధంలో ఉంచిన కారణంగా ఆయనకు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు కోర్టు ప్రకటించింది. విచారణకు తెరపడేటట్టు కనిపించడం లేదని కూడా కోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. సత్యేంద్ర జైన్‌కు బెయిలు మంజూరు చేస్తూ తీర్పు వెలువరించిన సమయంలో కోర్టులోనే ఉన్న ఆయన భార్య భావోద్వానికి గురై కంటతడి పెట్టారు.

"విచారణలో జరుగుతున్న జాప్యం, 18 నెలల పాటు నిర్బంధంలోనే ఉంచడం వల్ల నిందితుడికి ఉపశమనం కలిగించడమే సబబని కోర్టు భావిస్తోంది" అని ప్రత్యేక న్యాయమూర్తి విషాల్ గాగ్నే తీర్పునిచ్చారు. సత్యేంద్ర జైన్‌కు కోర్టు బెయిలు మంజూరు చేస్తూ, సాక్ష్యులను కలవడం కానీ, విచారణను ప్రభావితం చేయడం కానీ, దేశం విడిచిపెట్టి వెళ్లడం కానీ చేయరాదని షరతులు విధించింది. తనకు సంబంధం ఉన్న నాలుగు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్‌కు సత్యేంద్ర జైన్ పాల్పడ్డారంటూ 2022 మే 30న ఆయనను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది.

# బీజేపీపై అసత్య ఆరోపణలు మానుకోవాలి.. లేకుంటే..



**న్యూఢిల్లీ- నవభూమి:**బీజేపీపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని హీరోయిజం చూపించవద్దని ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డిమాజీ మంత్రి నాగేంద్రకు సూచించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బళ్లారి(బెంగళూరు): బీజేపీపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని హీరోయిజం చూపించవద్దని ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి(%మీూా +ఖశ్రీఱ జీఖుతీస్త్రఖఱ =వ్ుఎఎ%) మాజీ మంత్రి నాగేంద్రకు సూచించారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతో సహా గత యూపీఏ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలుగా ఉన్న అనిల్ లాడ్, ఆనంద్‌సింగ్, సురేశ్‌బాబు, నాగేంద్ర సతీశ్ శైల్ తదితరులు సీబీఐ అరెస్టు చేయడం కారణంగా జైలులో ఉన్న సంగతి మర్చిపోవద్దన్నారు. మళ్ళీ మంత్రి కావాలనుకునే నేపథ్యంలో బీజేపీపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణంలో విమాన టిక్కెట్లు, ఇంటి ఖర్చుల కోసం కార్పొరేషన్ డబ్బును వినియోగించినట్లు ఈడీ సమర్పించిన చార్జిషీట్‌లో పేర్కొందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు ముగ్గురు ఎమ్మెల్యేలు భరత్‌రెడ్డి, గణేశ్, కూడ్లిగి ఎమ్మెల్యే శ్రీనివాసులు రూ 1480కోట్లు కేటాయించారని, కార్యకర్తలకు ఒక్కొక్కరికి పదివేలు అందజేశారని, ఇదంతా ఈడీ రికార్డుల నుంచి తెలిసిందన్నారు. ఎన్నికల కోసం మొత్తం రూ. 20కోట్లు వినియోగించారన్నారు. వాల్మీకి, వక్ఫ్, సిద్దార్థట్రస్ట్, ముడాతోపాటు గత 15 నెలల్లో కాంగ్రెస్ అనేక కుంభకోణాల్లో కూరుకుపోయిందన్నారు. ఇది బ్యాంకు స్కాం అని చెప్పడానికి సిగ్గుపడాలన్నారు.

సందూరు గెలుపే లక్ష్యం

ఈసారి సందూరు ఉప ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని, ఎన్నికల్లో చురుగ్గా పాల్గొంటామన్నారు. అందుకు సందూరులో ఇంటింటికి వెళుతామన్నారు. ఆదివారం నుంచి ప్రతి గ్రామానికి వెళ్లి, ప్రచారం చేస్తానన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనిల్‌నాయుడు, పంచాయతీ మాజీ సభ్యుడు గోనాల్‌రాజ శేఖర్‌గౌడ్, హెచ్ హనుమంతప్ప, డా. బీకే సుందర్ పాల్గొన్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్
శనివారం
19 ၊ అక్టోబర్ ၊ 2024



విజయ్ దేవరకొండ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. విజయ్ దేవరకొండ నటిస్తోన్న

## ఫ్యాన్స్ మీట్‌లో విజయ్ దేవరకొండ.. ఇంతకీ ఇప్పుడెక్కడున్నాడంటే..?

సినిమాల్లో ఒకటి వీడీ 12 గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. ప్రస్తుతం కేరళలో చిత్రీకరణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా బ్రేక్ సమయంలో అభిమానులను కలిసేందుకు ఫ్యాన్స్ మీట్ ఏర్పాటు చేశాడు.%ఈ నేపథ్యంలో విజయ్ దేవరకొండకు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. తమ ఫేవరేట్ హీరోలతో ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు అభిమానులు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.
పాపులర్ మలయాళం సినిమాటోగ్రాఫర్ గిరీష్ గంగాధరన్ ఈ చిత్రానికి పనిచేస్తుండటంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి. హై ఓల్టేజీ కాప్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న 12 చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు.






మలైకా అరోరా

మలైకా అరోరా-అర్జున్ కపూర్ రిలేషన్ షిప్ కి బ్రేక్ పడిందంటూ కొంత కాలంగా నెట్టింట ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. వివాహ బంధంతో కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారనుకుంటే? ఆ బంధం మధ్యలోనే వీగిపోవడం ఏంటనే? అంశంపై బాలీవుడ్ లో చర్చ సాగుతోంది. అయితే విడిపోయినట్లు ఇరువురు నుంచి ఎలాంటి కన్ఫర్మేషన్ లేదు. బాలీవుడ్ లో మీడియాలో వస్తోన్న కథనాలు ఆధారంగానే ఈ చర్చ మొదలైంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మలైకా వ్యక్తిగత జీవితానికి సంబంధించి తాను ఎలా ఉంటాను? అనే అంశాన్ని హైలైట్ చేసింది. ఇంతవరకూ నేను ఏ విషయంలో పశ్చాత్తాపం చెందలేదు. తప్పులు చేస్తూ కొత్త విషయాలు తెలుసుకున్నాను. వ్యక్తిగతంగా, వృత్తి పరంగా ఇలా ఈ స్టేజ్ లో ఉన్నాను అంటే దానికి కారణం నేను తీసుకున్న నిర్ణయాలనే అని బలంగా నమ్ముతాను అంది. దీంతో బ్రేకప్ వార్తలకు మరింత ఆజ్యం పోసినట్లు అయింది. రోలెక్స్ ట్విస్ట్ తో ఫ్యాన్స్‌కి మరో ట్రీట్ ఇద్దరి మధ్య ఈగో

## బ్రేకప్ గురించి అలా హింట్ ఇచ్చిందా!

తలెత్తడంతోనే మలైకా ఇలా తన వ్యక్తిగత జీవితం గురించి పంచుకుందనే చర్చ సాగుతుంది. ఎప్పుడూ జంటగా కనిపించే అర్జున్ కపూర్- మలైకా ఆరోరా? ఇప్పుడలా కనిపించడం లేదు. ఒకప్పుడు ఏదైనా ఈవెంట్ కి వెళ్తే జంటగా వెళ్లేవారు. కానీ ఇప్పుడు ఎవరికి వారు సింగిల్ గా హాజరవుతున్నారు. దీంతో బ్రేకప్ పుకార్లు మొదలయ్యాయి. తాజాగా మలైకా వ్యాఖ్యలతో అది నిజమేనా? అన్న సందేహం బల పడుతుంది. అలాగే వృత్తిపరంగానూ మలైకా మనసులో మాట బయట పెట్టింది. ఇంతవరకూ అతిధి పాత్రలు..ఐటం పాటల్లోనే కనిపించా. కానీ ప్రధాన పాత్రలో ఓ సినిమా చేయాలని ఉందని ఓపెన్ అయింది. ఇంతవరకూ ఈ విషయం ఎక్కడా చెప్పలేదు. వాస్తవానికి మలైకాకి కొంత కాలంగా సినిమా అవకాశాలు రాలేదు. వయసు ముదరడంతో పాటు కొత్త భామల నుంచి పోటీ ఉండటంతో మలైకాకి ఛాన్సులు రాలేదనే ప్రచారం ఉంది.

## పవన్ కల్యాణ్ టైటిల్స్ రిపీట్‌పై వర్రీ అవుతున్న ఫ్యాన్స్..



సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోల సినిమాల టైటిల్స్ కు సూపర్ క్రేజ్ ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవరం లేదు. కొన్ని టైటిల్స్‌నైతే మూవీ లవర్స్ ఎప్పటికీ మరిచిపోలేరు. అలాంటి సూపర్ క్రేజీ టైటిల్స్‌తో ఇండస్ట్రీకి బ్లాక్ బస్టర్స్ హిట్స్ అందించాడు పవన్ కల్యాణ్ అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి తొలి ప్రేమ, తమ్ముడు, ఖుషి, అత్తారింటికి దారేది, తీన్మార్, జల్సా.. ఇలా టైటిల్స్ ఎక్కడో ఒక చోట రిపీట్ అవుతూ ఉంటాయి.
అయితే పవన్ కల్యాణ్ టైటిల్స్‌తో కొత్త సినిమాలు వస్తుండటంతో కొందరు అభిమానులు హ్యాపీగా ఉంటే.. మరొకొందరేమో నిరాశచెందుతున్నారట. ఇంతకీ టైటిల్స్ విషయం తెరపైకి రావడానికి కారణం.. యాంకర్ ప్రదీప్ మాచిరాజు నటిస్తోన్న రెండో చిత్రానికి పవన్ కల్యాణ్ డెబ్యూ సినిమా అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి టైటిల్ పెట్టడం. అయితే పవన్ కల్యాణ్, టైటిల్ క్రేజ్ కొత్తగా వస్తున్న సినిమాలకు బజ్ పరంగా కలిసొచ్చే అంశంమైనప్పటికీ కొన్ని సార్లు టైటిల్స్ బెడిసికొట్టే అవకాశాలు కూడా లేకపోలేదు. ఈ టైటిల్స్‌ను ఓ వైపు మెగా హీరోలు వాడుతుండగా.. మరోవైపు ఇతర హీరోలు కూడా తమ సినిమాలకు పెట్టుకుంటున్నారని తెలిసిందే.అయితే టైటిల్స్ రిపీట్ చేసిన మెగా హీరోల సినిమాలను.. పవన్ కల్యాణ్ సినిమాలతో పోల్చడం తద్వారా అంచనాలు పెరిగిపోతానయడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ మిగితా హీరోల విషయానికొస్తే మాత్రం టైటిల్స్ రిపీట్ చేసుకోవడం వారి వారి సినిమాకు మార్కెట్ పరంగా బాగా కలిసొచ్చే విషయమేనని ట్రేడ్ పండితులు చెబుతున్నారు.కొన్ని అంశాల పరంగా టైటిల్స్ రిపీట్ చేయడం ఇబ్బందికర విషయమే అయినా.. చాలా విషయాల పరంగా చూసుకుంటే పవన్ కల్యాణ్ స్టార్‌డమ్ మాత్రం బాగా కలిసొచ్చే విషయమేనని అంటున్నారు. ఇంకేంటి ఈ లెక్కన టైటిల్స్ పునరావృతం అయ్యే విషయంలో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నమాట.

## రహస్య గోరక్‌తో రిలేషన్‌షిప్ కొంతమందికే తెలుసు.. కిరణ్ అబ్బవరం




టాలీవుడ్ యాక్టర్ కిరణ్ అబ్బవరం ఇటీవలే తన కోస్టార్, నటి రహస్య గోరక్ తో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టాడని తెలిసిందే. కిరణ్ అబ్బవరం ఓ వైపు ప్రొఫెషనల్ లైఫ్‌ను లీడ్ చేస్తూనే.. మరోవైపు మ్యారేజ్ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నాడు. ప్రస్తుతం తన తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్ క ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నాడు. ప్రమోషనల్ ఇంటర్వ్యూలో కిరణ్ అబ్బవరం తన లవ్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకున్నాడు.జనాలకు చాలా వరకు నా వ్యక్తిగత జీవితం గురించి తెలియదు. నేను తరచూ ఎవరినీ అంతగా కలవను. నా పని, ఆఫీసుకు మాత్రమే పరిమితమవుతా. నాకు సన్నిహితంగా ఉండే కొంతమంది వ్యక్తులకు మాత్రమే రహస్య గోరక్‌తో నా రిలేషన్‌షిప్ గురించి తెలుసు. ఈ విషయాన్ని పబ్లిక్‌కు చెప్పద్దనుకున్నాం. కానీ పెళ్లి విషయానికొస్తే మాత్రం అది సీక్రెట్‌గా పెట్టలేని విషయం.రాజా వారు రాణి వారు షూట్‌లో తొలి రోజే రహస్య గోరక్‌తో ప్రేమలో పడ్డా. లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాన్సెప్ట్‌ను నేనంతగా నమ్మను. కానీ ఇది అలా జరిగిపోయింది. నా మొదటి సినిమా మొదలై ఐదేళ్లవుతుంది.. అంటూ చెప్పుకొచ్చాడు కిరణ్ అబ్బవరం. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## వెకేషన్ మూడ్‌లో త్రిష.. గర్ల్స్ గ్యాంగ్‌తో కలిసి ఎక్కడికెళ్లిందో తెలుసా..?




తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించిన అతికొద్ది మంది భామల్లో టాప్‌లో ఉంటుంది త్రిష సీనియర్ యాక్టర్లు, దర్శకనిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయిన ఈ ముద్దుగుమ్మ స్టార్ యాక్టర్ల సినిమాలతో ఫుల్ బిజీగా ఉంది. ప్రస్తుతం విదా ముయార్చి, విశ్వంభర, గుడ్ బ్యాడ్ అగ్లీ, రామ్, థగ్ లైఫ్ లాంటి భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులను లైన్‌లో పెట్టింది త్రిష.
బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ప్రొఫెషనల్ కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉన్న ఈ భామ కొంచెం రిలాక్సేషన్ మూడ్‌లోకి వెళ్లిందా.. అంటే అవుననే క్లారిటీ ఇచ్చేస్తున్నాయి తాజా స్టిల్స్. త్రిష ప్రస్తుతం తన గర్ల్ గ్యాంగ్‌తో కలిసి మొరాకో వెకేషన్ టూర్‌లో బిజీగా ఉంది. స్టైలిష్ గాగుల్స్ పెట్టుకున్న త్రిష.. స్లీవ్ లెస్ టాప్ సూట్‌లో అక్కడి లొకేషన్‌లో ఓ బుడతడితో ఫొటో దిగింది.అంతేకాదు అందమైన లొకేషన్‌లో తన గ్యాంగ్‌తో కలిసి తిరుగుతూ.. రుచికరమైన సంప్రదాయ రుచులను ఆస్వాదించింది. ఇందుకు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## జానీ మాస్టర్ ఇలా చేశాడు అంటే నమ్మబుద్ధి కావడం లేదు : ఆనీ మాస్టర్



లైంగిక వేధింపుల కేసులో టాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఓ లేడి డ్యాన్సర్‌పై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు జానీపై ఆరోపణలు రాగా అతడిపై ఐపీసీ సెక్షన్ 376, 506, 323(2)తోపాటు పోక్సో కేసులు నమోదు అయ్యాయి. అయితే ప్రస్తుతం బెయిల్ మీదా బయటకు వచ్చిన జానీ మాస్టర్ విషయంపై తాజాగా ప్రముఖ లేడీ కొరియోగ్రాఫర్ ఆనీ మాస్టర్ స్పందించింది.
ఆనీ మాస్టర్ మాట్లాడుతూ.. జానీ మాస్టర్ లైంగిక వేధింపుల కేసులో అరెస్ట్ అయిన సంగతి తెలిసి ఇప్పటికి నేను షాక్‌లో ఉన్నాను. జానీ మాస్టర్‌తో కలిసి రెండేళ్లు పని చేశా. నన్ను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదు. జానీ చాలా మంచి వ్యక్తి. ఎంతో మంది డ్యాన్సర్లకు సాయం చేశారు. అయితే నేను ఇన్నిరోజులు కలిసి పనిచేసిన మాస్టర్ ఇలా చేశాడా అంటే నమ్మబుద్ధి కావడం లేదు. నేను కూడా అందరిలాగే టీవీలోనే చూసి తెలుసుకున్నాను. అయితే ఇది అమ్మాయి విషయం కాబట్టి ఇప్పుడు ఎవరూ కూడా స్పందించట్లేదు. ఒకవేళ బాధితురాలికి నిజంగా అన్యాయం జరిగితే ఆమె తరపున మద్దతుగా నిలబడతాను. అంటూ ఆనీ మాస్టర్ చెప్పుకొచ్చింది.

## తొందరపాటుతో యశస్వీ స్టంపౌట్ .. రోహిత్ హాఫ్ సెంచరీ



**న్యూఢిల్లీ-నవభూమి:**తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే కుప్పకూలిన భారత జట్టు రెండో ఇన్నింగ్స్ ధాటిగా మొదలెట్టింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(35) స్టంపౌట్ అయ్యాక రోహిత్ శర్మ(52) జోరు పెంచాడు. తొలి ఇన్నింగ్స్‌లో హడలెత్తించిన మ్యాట్ హెన్రీ ఓవర్లో వరుసగా 4, 6, 4 బాదేసి అర్ధ శతకం సాధించాడు. అయితే.. అజాజ్ పటేల్ బౌలింగ్‌లో బంతిని డిఫెండ్ చేసినప్పటికీ అది వికెట్లను గిరాటేసింది. అంతే.. 95 వద్ద రెండో వికెట్ పడింది. సర్ఫరాజ్ ఖాన్ క్రీజులోకి వచ్చాడు. మరో ఎండ్‌లో విరాట్ కోహ్లీ(6) ఆచితూచి ఆడుతున్నాడు. 22 ఓవర్లకు భారత జట్టు స్కోర్.. 95/2.కివీ బౌలర్లను ఉతికేస్తూ బౌండరీల మోత మోగించారు. దాంతో, స్కోర్ బోర్డు పరుగులు పెట్టింది. తొలి ఇన్నింగ్స్ హీరోలు మ్యాట్ హెన్రీ, విలియం ఓ రూర్కేల ఓవర్లో భారీ షాట్లు ఆడిన యశస్వీ అనవసర షాట్‌కు ప్రయత్నించి ఔటయ్యాడు. అజాజ్ పటేల్ విసిరిన తొలి బంతిని ఫ్రంట్ ఫుట్ వచ్చి ఆడబోయిన అతడు స్టంపౌట్ అయ్యాడు. దాంతో, 72 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.
దంచేసిన రవీంద్ర, సౌథీ.చిన్నస్వామి స్టేడియంలో మూడో రోజు న్యూజిలాండ్ యువకెరటం రచిన్ రవీంద్ర(134) శతకంతో గర్జించాడు. మాజీ సారథి టిమ్ సౌథీ(65) మెరుపు హాఫ్ సెంచరీతో భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అంతకుముందు ఓపెనర్ డెవాన్ కాన్వే(91) సైతం అర్ధ శతకం బాదగా.. న్యూజిలాండ్ 402 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. భారత బౌలర్లలో రవీంద్ర జడేజా(3/72), కుల్దీప్ యాదవ్(3/99)లు రాణించారు.

## రచిన్ రవీంద్ర 134, న్యూజిలాండ్ 402 ఆలౌట్



**బెంగుళూరు-నవభూమి:** భారత్‌తో చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టులో.. న్యూజిలాండ్( జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగులకు ఆలౌటైంది. దీంతో కివీస్ 356 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. న్యూజిలాండ్ బ్యాటర్ రచిన్ రవీంద్ర 134 రన్స్ చేసి కుల్దీప్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ టిమ్ సౌథీ 65 రన్స్ చేశాడు. ఎనిమిదో వికెట్‌కు రవీంద్ర, సౌథీలు.. 137 రన్స్ జోడించారు. ఇండియా తన తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులకే ఆలౌటైన విషయం తెలిసిందే. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్, రవీంద్ర జడేజాలు చెరి మూడేసి వికెట్లు తీసుకున్నారు. సిరాజ్ రెండు వికెట్లు తీసుకోగా, బుమ్రా-అశ్విన్‌కు చెరో వికెట్ దొరికింది. రచిన్ రవీంద్ర సెంచరీలో 13 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి.

## ఇంగ్లండ్‌ను చుట్టేసిన పాకిస్థాన్ స్పిన్నర్లు.. రెండో టెస్టులో భారీ విజయం



**ముల్తాన్ -నవభూమి:**పాకిస్థాన్ స్పిన్ ఉచ్చులో ఇంగ్లండ్ ట్రాప్ అయ్యింది. దీంతో ముల్తాన్‌లో జరిగిన రెండో టెస్టులో 152 రన్స్ తేడాతో పాకిస్థాన్ జయభేరీ(%ఖుఎఅఖుఅ ఔఅఅ%) మోగించింది. 297 రన్స్ టార్గెట్‌తో బరిలోకి దిగిన ఇంగ్లండ్.. నాలుగవ రోజు తొలి సెషన్‌లోనే 144 రన్స్‌కు ఆలౌటైంది. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అత్యధికంగా 37 రన్స్ చేశాడు. ఇక పాకిస్థాన్ బౌలర్లలో నొమన్ అలీ రెండో ఇన్నింగ్స్‌లో 46 రన్స్ ఇచ్చి 8 వికెట్లు తీసుకున్నాడు. ప్రస్తుతం మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ 1-1తో సమంగా నిలిచింది. తొలి టెస్టును ఇంగ్లండ్ గెలుచుకున్నది. మూడవ టెస్టు రావల్పిండిలో గురువారం ప్రారంభంకానున్నది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**